




ESTD: 1999 www.voodayam.com

# వుదయం








కరీంనగర్ | 27-02-2026 శుక్రవారం | సంపుటి : 14 | సంచిక :80 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on


# తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు

# అవమానాన్ని సహించరు



**అమరవీరుల స్ఫూర్తితో మీరందరూ విధులు నిర్వర్తించాలి • నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి • టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం • కొందరు ఉద్యోగాలను అమ్ముకున్నామని మాపై తప్పుడు ప్రచారం చేశారు • వారికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు • మీ ఉద్యోగాల కోసం ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడింది • గ్రూప్ –1, 2 అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ.. అవమానాన్ని భరించరని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాకతీయులపై వీరోచితంగా పోరాడినా సమ్మక్క – సారలమ్మలు దేవతలు అయ్యారన్న ఆయన నిరంకుశ నిజాంపై తిరుగుబాటు చేసిన చరిత్ర తెలంగాణ నేలకుందని చెప్పారు. ఇక సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం,స్వేచ్ఛ,సమాన అవకాశాల కోసం వారు అమరవీరులు అయ్యారన్నారు. అలాంటి వీరుల స్ఫూర్తితో నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని గ్రూప్ 1, 2 ఉద్యోగులకు సీఎం పిలుపునిచ్చారు. 6 లక్షల మంది పోటీపడితే 582 మంది గ్రూప్ 1,775 మంది గ్రూప్ 2 ఉద్యోగాలు సాధించారని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో గ్రూప్–1, గ్రూప్–2 అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

మిగతా 2లో



## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే జీతంలో కోత

పేదవారికి సాయం చేసే ముందు తల్లితండ్రులను గుర్తు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులకు సూచించారు. తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల జీతంలో 10 నుండి 15 శాతం కోత పెట్టేలా అసెంబ్లీ లో చట్టం చేయబోతున్నామని ప్రకటించారు. ఈ విషయంపై త్వరలోనే హార్వర్డ్ యూనివర్సిటీ, ఎంసీహెచ్ఆర్ డీ మధ్య ఒప్పందం జరగబోతోందని సీఎం చెప్పారు. చట్టం గురించి హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన పలువురు వచ్చి ఎంసీహెచ్ఆర్డి లో ఉద్యోగులకు శిక్షణ ఇస్తారన్నారు.

# భారత - ఇజ్రాయెల్ సంబంధాలకు ప్రత్యేక వ్యూహాత్మక స్థాయి

## భారత్‌లో జి2జి సమావేశానికి ప్రణాళిక



**జెరూసలేం, ఫిబ్రవరి 26 :** తమ మధ్య గల ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య హోదాకు తీసుకువెళ్లాలని భారత్, ఇజ్రాయెల్ నిర్ణయించుకున్నట్లు ప్రధాని నరేంద్ర గురువారం వెల్లడించారు. ఇజ్రాయెలీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో కలిసి ఆయన ఉమ్మడి విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాలపరీక్షను ఎదుర్కొన్న మా సంబంధాలకు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం హోదాను ఇవ్వాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం. ఇది రెండు దేశాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది, అని మోడీ అన్నారు. ఇద్దరు నాయకుల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఈ చర్చల సందర్భంగా ఇరు దేశాలు ఆవిష్కరణలు, వ్యవసాయం సహా సహకారాన్ని విస్తరించుకునేందుకు పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. భారత్‌లో ఇరు ప్రభుత్వాల మధ్య సమావేశం కోసం ప్రణాళికలు భారత్‌లో ప్రభుత్వానికి–ప్రభుత్వానికి (జి2జి) సమావేశం నిర్వహించడానికి రెండు దేశాలు అంగీకరించాయని నెతెన్యాహు చెప్పారు. భారత్‌లో జి2జి సమావేశం నిర్వహించాలని మేం అంగీకరించాం. మేం దాన్ని ఎంత త్వరగా ఏర్పాటు చేయగలిగితే, ఇక్కడి ఉన్న విశిష్ట మంత్రు లను తీసుకువెళ్తాము అని నెతెన్యాహూ తెలిపారు. ఆయన భారతదేశ పాలనను ప్రశంసించారు. ఇరు వైపుల మధ్య సన్నిహిత అవగాహనను పట్టి చూపారు. మీకు అద్భుతమైన సమర్థవంతమైన ప్రభుత్వం ఉంది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఈ అద్భుతమైన జి2జిలో ఇక్కడ కలిసిన మనస్సులు, మేధస్సు సమ్మేళనం కొనసాగుతుంది. ఇది పరస్పరం ఒకరికొకరం ఇచ్చిపుచ్చుకోగల భారీ ప్రయోజనాలకు గొప్ప ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.


### ఆవిష్కరణ, విద్య, భవిష్యత్ సహకారం

ముఖ్యంగా విద్య, కృత్రిమ మేధస్సులో ఆవిష్కరణ, సాంకేతిక పురోగతిపై ఉమ్మడి దృష్టిని నెతన్యాహు నొక్కి చెప్పారు.

మిగతా 2లో

# కేసీఆర్ అండ్ కో విష ప్రచారం

## ప్రభుత్వ ప్రగతి చూడలేకనే..



- పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్
- వెలుగుమెట్లలో 2023లో ఇళ్లు కూలగొట్టింది బిఆర్ఎస్ ప్రభుత్వమే
- బాధితులకు ఇంటిస్థలం, ఇళ్లు ఇచ్చే బాధ్యత మాది
- కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బిఆర్ఎస్ అవినీతికి బిజెపి సహకారం
- కేసీఆర్ అసెంబ్లీకి రావాలి.. మంచి సలహాలు సూచనలు ఇవ్వాలి
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతి పక్ష బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారనీ, వీరికి బిజేపీ నేతలు వంతపాడుతున్నారని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. గురువారం సచివాలయంలో ఎంపీ బలరాం నాయిక్, రామ సహాయం రఘుమారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, మాధవర రెడ్డితో కలిసి మీడియాతో మాట్లా డారు. ముందుగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ 2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొట్టించిందని ఆరోపించారు. అక్కడ పేదలకు ఇండ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసిందన్నారు.

మిగతా 2లో

# రాష్ట్రంలో వంద పబ్లిక్ స్కూళ్లు

- పైలెట్ ప్రాజెక్టుగా నియోజకవర్గంలో ఒకటి
- ఏడాదిలో సకల వసతులతో ప్రభుత్వ పాఠశాలలు
- ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక ఏఐ శిక్షణ
- 12వ తరగతి వరకు విద్యార్థులకు అల్పాహారం
- వర్సిటీలకు నిధులపై నివేదిక సమర్పించండి
- విద్యా శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

2

# హైదరాబాద్‌లో పాడ్ ట్యాక్సీలు



- పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్‌గా నామకరణం
- మెట్రో రైళ్లను కనెక్ట్ చేస్తూ ఏర్పాటు
- మెట్రో స్టేషన్ల నుంచి తమ గమ్యస్థానాలకు
- ముందుగా హైటెక్ సిటీ ప్రాంతంలో పరుగులు
- పీపీటీ భాగస్వామ్యంతో కొత్త రవాణా

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఎంఎస్) :** అభివృద్ధిలో దూసుకువెళ్తున్న హైదరాబాద్ లో హై టెక్ రవాణా అందుబాటులోకి రానున్నది. ప్రస్తు తం ఆర్టీసీ బస్సులు, మెట్రోలు, ఆటోలు, ర్యాపిడో వంటి బైక్‌ల ద్వారా ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్న నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త తరహా ప్రయాణాన్ని ప్రజల కు అందుబాటులో తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నది. ఇందులో భాగంగా విదేశాల్లో మాదిరిగా త్వరలోనే పాడ్ ట్యాక్సీలు ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఈ పాడ్ ట్యాక్సీలను నగరంలోని మెట్రో స్టేషన్లను కనెక్ట్ చేయాలని నిర్ణయానికి వచ్చింది. ఈ తరహా రవాణాకు ప్రభు త్వం... పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్టీ)గా నామకరణం చేసింది. మెట్రోరైలు స్టేషన్ల నుంచి ప్రయాణికులు తొందరగా తమ గమ్యస్థానం చేరేందుకు ఈ పాడ్ ట్యాక్సీలను ప్రవేశపెట్టాలని యోచి స్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోనే చేపట్టాలనేది ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్‌వోటీ) విధానంలో సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనానికి కన్సల్టెంట్ ఎంపిక చేయనున్నారు. అందు కోసం హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం నగరంలో దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులు మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. నగరం ఓ మూల నుంచి మరో మూలకు త్వరగా చేరుకునేందుకు మెట్రో బెస్ట్ ఆప్షన్ అయింది. అయితే మెట్రో దిగిన తర్వాత తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఇవి అన్ని చోట్ల అందుబాటులో ఉండటం లేదు. ఉన్నా డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. దానికి తోడు ట్రాఫిక్‌లో నరకం. ఈ ఇబ్బందులను తొలగించేందుకు.. మెట్రో స్టేషన్ల నుంచి రోడ్ల మీదకు రావాల్సిన అవసరం లేకుండా నేరుగా పాడ్‌ట్యాక్సీల ద్వారా గమ్యస్థానాలను చేరుకునేలా వినూత్న రవాణా వ్యవస్థ ప్రవేశపెట్టేందుకు సర్కార్ రెడీ అయింది.

### ముందుగా ఐదు మార్గాల్లో ప్రయాణం

ముందుగా.. రాయదుర్గం–కూకట్‌పల్లి, రాయదుర్గం–హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్

మిగతా 2లో

# ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ ఇక్కడే

**సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**రానున్న రోజుల్లో ఉచిత శిక్షణ ఇప్పిస్తాం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :** ఖర్చుతో కూడిన ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్‌ను హైదరాబాద్‌లోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. సివిల్స్ కోచింగ్ కోసం తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న ఆయన రానున్న రోజుల్లో ఆ శిక్షణ హైదరాబాద్‌లోనే అందిస్తామన్నారు. విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్ ను తీసుకుంటామన్నారు. అలాగే మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని వివరించారు. గురువారం 59 దళిత కులాల సంఘాల నాయకులు లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్, కాచిగూడలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. అనంతరం వారు మంత్రి అడ్లూరితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దళితులకు కార్పొరేట్ స్థాయిలోవిద్యాను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్‌ను మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

మిగతా 2లో

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై కమిటీ

**కోదండరాం, ఉద్యమకారులతో మంత్రి పొన్నం భేటీ**

**త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం త్వరలో కమిటీ ఏర్పాటు చేయనుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉద్యమకారుల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని పునరుద్ఘాటించారు. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమకారులు మంత్రి పొన్నంను గురువారం హైదరాబాద్‌లోని మంత్రుల భవనాల సముదాయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారుల హామీల అమలుకు ఏర్పాటు చేయతలపెట్టిన కమిటీకి సంబంధించిన విధి విధానాలు, ఉద్యమకారుల హామీలపై చర్చించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో త్వరలో సీఎం రేవంత్ రెడ్డితో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం కావాలని ఈ సందర్భంగా నిర్ణయానికి వచ్చారు

మిగతా 2లో

# భూదాన్ భూములపై ముగ్గురు మంత్రుల కన్ను

## అందుకే నోటీసులు ఇవ్వకుండా పేదలను రోడ్డున పడేశారు

**స్వార్థ రాజకీయాల కోసం ప్రజలు, అధికారుల మధ్య చిచ్చు పెడుతున్నారు**

**అక్రమ కూల్చివేతలపై శాసనసభ, మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



ఆ భూములకు సంబంధించి ప్రజల వద్ద ఉన్న పట్టాలు సక్రమమేనన్న కేటీఆర్.. కాంగ్రెస్ నేతల బుద్ధే వంకర అన్నారు. దేశంలో ఒకప్పుడు ఒరిజినల్ గాంధీలు ఉండేవారనీ ఇప్పుడు డూప్లికేట్ గాంధీలు ఉన్నారన్నారు. గురువారం ఖమ్మం

**ఖమ్మం, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు అక్రమ సంపాదన కోసం 60 ఎకరాల భూదాన్ భూములపై కన్నేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అందులో భాగంగానే ఆయా భూముల్లో నివసిస్తోన్న పేదలకు నోటీసులు కూడా ఇవ్వకుండా రోడ్డున పడేశారని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజలు, అధికారుల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. కచ్చితంగా ఇళ్ల కూల్చివేత పాపం మంత్రులు పొంగులేటి, భట్టి, తుమ్మలదేనన్నారు. వారికి పేదల ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు. జిల్లా వెలుగుమట్లలో పర్యటించిన కేటీఆర్.. భూదాన్ భూ బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకైనా వెళ్లి కొట్లాడామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎసే అధికారంలో వస్తోందని కేటీఆర్ జోస్యం చెప్పారు. అప్పుడు తమ ప్రభుత్వం మీకు ఇల్లు కట్టిస్తుందని హామీ ఇచ్చారు. ఇది తన బాధ్యత అని భరోసా ఇచ్చారు. అక్రమ కూల్చివేతల గురించి శాసనసభ, శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని హామీ ఇచ్చారు.

మిగతా 2లో

# 45 మంది ఐఏఎస్‌లకు స్థానచలనం



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఎంఎస్) :** పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఏకంగా 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జాను నియమించారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జాకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్.. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌కు అవకాశం కల్పించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్.. దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు.. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి. దివ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

మిగతా 2లో



- జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా
- పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్
- జితేశ్ వి. పాటిల్ కు ఎస్పీడీసీఎల్ సీఎండీ బాధ్యతలు
- విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌కు అవకాశం
- మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లు


**CHANGE OF NAME**

I Dainampelly Shirisha Rani (Old Name)D/o Sharan Babu at H.No. 2-9-180, VikasNagar, Road Number-20, HanamkondaDist. Hanamkonda Telangana - 506001 Have Changed My Name to (New Name) PAGADALA SHIRISHA RANI (New Name)W/o PAGADALA SUNITH SAM at H.No.5 - 77/2, Teachers Colony, Rajyalaxmi Nagar - 2,Gurram guda, Hyderabad, Telangana - 501510.

# సహించరు



**మొదటి పేజీ తరువాయి..**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా టీ జీ పీ ఎస్ సీ ని ప్రక్షాళన చేశామన్నారు. అందులో గ్రూప్ పరీక్షలపై అవగాహన ఉన్న వాళ్లను చైర్మన్ గా, సభ్యులుగా నియమించామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో లాగా ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో అమ్మకుండా అత్యంత కఠినంగా పరీక్షలు నిర్వహించామన్నారు. తాము ఇంత పక్కాగా ఉన్నా.. కొందరు ఉద్యోగాలను అమ్ముకున్నామని తమపై తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. అలాంటి వారికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క గ్రూపు-1 ఉద్యోగం అయినా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం 15 ఏళ్ల పాటు గ్రూప్-1 ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆరోపించారు. కానీ ప్రజా ప్రభుత్వం గ్రూప్-1 నిర్వహించి ఆకాంక్షలను నెరవేర్చిందని చెప్పారు. గ్రూప్-1 నికి ఎంపికైన ఆనందం 24 గంటలు లేకుండా గిట్టని వాళ్లు కొందరు కోర్ట్ కు వెళ్లారని సీఎం ఆరోపించారు. అభ్యర్థులు ఒక్క తప్పు చేయలేదు.. మెరిట్ మీద ఎంపిక అయ్యారని ప్రభుత్వం భావించి సుప్రీంకోర్టు వరుకు వెళ్లి కొట్లాడిందని వివరించారు. శిక్షణ పూర్తిచేసుకున్న అధికారులు అందరూ ఉద్యోగంలో నిబద్ధత కనబర్చి... నాలుగు కోట్ల ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఎలాంటి అప్రోచ్‌తో ఉద్యోగంలో చేరారో రిటైర్మెంట్ వరకూ అలాగే ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగంలో మూడు రకాల పరిస్థితులు ఎదురవుతాయి. గరం...నరం.. బేషరం.. మీరంతా మొదటి పరిస్థితి దగ్గరే ఆగిపోతే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. గరం, నరం, బేషరం అనే నానుడి తప్పు అని మీరంతా ప్రూవ్ చేయాలని చెప్పారు.

# కేసీఆర్ అండ్ కో విష ప్రచారం

**మొదటి పేజీ తరువాయి..**

కానీ ఇందిరమ్మ ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ అక్రమంగా ఉన్న ఇండ్లను తొలగించిందని చెప్పారు. పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పెటెంట్ అన్న పొంగులేటి .. అక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో నిజంగా పేదలపై బిఆర్ఎస్ బావ మరుదులు, ఫాంహౌస్ లో ఉండి కుట్రలు చేస్తున్న కేసీఆర్ వెంటనే స్పందించి కాళే శ్వరంలో దోచు కున్న, దాచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని పొంగు లేటి సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌ను కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ ను చేపట్టి ఎనిమిదవ వింతగా ప్రచారం చేసుకుందని ఎద్దేవా చేశారు.వారి హయాంలోనే రూ. లక్షలాది కోట్ల ప్రాజెక్ట్ కట్టడంతో పాటు అవినీతి కారణంగా బీటలు వారిందన్నారు. నాలుగేళ్లలో 168 టిఎంసి నీరు ఇస్తామని చెప్పి దీనిలో 50 టిఎంసిల నీటిని సముద్రం పాలుచేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బిఆర్ఎస్ కు ఎటీఎంగా మారిందన్న బిజేపీ నేతలు.. అదే పార్టీతో చేతులు కలిపారని ఆరోపించారు. జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదిక ఇచ్చినా, అసెంబ్లీలో తీర్మానం చేసి సిబిఐకి ఇచ్చినా ఇంతవరకు కేంద్రం కనీసం స్పందించలేదన్నారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో వదిలేసిన ప్రాజెక్ట్‌లను తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. వచ్చే నెల 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీకి కేసీఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలని సూచించారు. గతంలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేని బీఆర్ఎస్ కు తాము కచ్చితంగా అవకాశం ఇస్తామని చెప్పారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..బిఆర్ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్ట్‌ల విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసిందని మండిపడ్డారు. 196 టిఎంసీల నీరు ఇస్తామని చెప్పి 168 టీఎంసీలకు పరిమితం చేసిందన్నారు. దీంతో 50 టీఎంసీలు సముద్రంలో కలిపిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడితే తాము అధికారంలో వచ్చాక శ్వేత పత్రం జారీ




చేశామన్నారు. అసెంబ్లీలో కాళేశ్వరంపై చర్చించడంతో పాటు కేంద్రం చర్యలు కోరామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ. 48వేల కోట్లు మిత్తీగా కట్టిందన్న పొన్నం... కేంద్రప్రభుత్వం ఇకనైనా నిధులు ఇవ్వాలని కోరారు.

మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ .. పదేండ్ల పాలనలో భారీ అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్.. దేశంలోని ప్రాంతీయ పార్టీల్లోకెల్లా ధనిక పార్టీగా మారిందన్నారు. సుమారు రూ. వెయ్యి కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు , ఎలక్టోరల్ బాండ్లు దీనికి నిదర్శనమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తో ఏర్పడిన నష్టాన్ని కేసీఆర్ నుంచి వసూలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రాక్టర్లు, కాసుల కోసమే బిఆర్ఎస్ అనుకూల నీటిప్రాజెక్ట్‌లను చేపట్టిందన్నారు.

## హైదరాబాద్‌లో
# పాడ్ ట్యాక్సీలు

**మొదటి పేజీ తరువాయి..**

మెట్రో స్టేషన్లు, నాలెడ్జి సిటీ, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. పాడ్ ట్యాక్సీలు పూర్తిగా ఆటోమేటెడ్, డ్రైవర్ లేకుండా నడుస్తాయి. ఎలివేటెడ్ ట్రాక్‌లపై నడిచే ఈ ట్యాక్సీలు..గంటకు గరిష్ఠంగా 40 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. ప్రతి పాడ్ ట్యాక్సీలో 6 నుంచి 8 మంది ప్రయాణించవచ్చు. గంటకు 10వేల మందిని చేరవేసే సామర్థ్యం ఉంటుంది. బ్యాటరీ లేదా విద్యుత్తు వినియోగంతో ఎలాంటి కాలుష్యం సమస్య తలెత్తదు. మెట్రో స్టేషన్‌లో దిగడానికి కంటే ముందు పాడ్‌ట్యాక్సీని బుక్ చేసుకోవడం ద్వారా సమయా ఆదా అవుతుంది. ఇలాంటి రవాణా వ్యవస్థ ప్రస్తుతం ముంబైలో పట్టాలెక్కుతుండగా.. త్వరలోనే హైదరాబాద్ నగరంలోనూ అందుబాటులోకి రానుంది.

## 45 మంది ఐఎఎస్‌లకు
# స్థానచలనం

**మొదటి పేజీ తరువాయి..**

01. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శి – రాహుల్ బొజ్జా
02. పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ – సంజయ్ కుమార్
03. ఎస్పీడీసీఎల్ సీఎండీ – జితేశ్ వి. పాటిల్
04. కొత్త డిస్కం సీఎండీ – ముషారఫ్ ఫారూకీ
05. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ – ఈ. శ్రీధర్
06. ఐటీ అండ్ సీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ – ఎన్. శ్రీధర్
07. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం సెక్రటరీ – గౌరవ్ ఉప్పల్
08. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ – ఎం.దాన కిషోర్
09. ఫైనాన్స్ శాఖ స్పెషల్ సెక్రటరీ – సిక్తా పట్నాయక్
10. ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ – బి.ఎం. సంతోష్
11. లేబర్ స్పెషల్ కమిషనర్ – పమేలా సత్పతి
12. కో ఆపరేటివ్ కమిషనర్ – పి.ఎస్. రాహుల్ రాజ్
13. దేవాదాయశాఖ కమిషనర్ – ఎం.హనుమంతరావు
14. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి – డి.దివ్య
15. మహబూబ్‌నగర్ కలెక్టర్ – బి. విజయేంద్ర
16. కరీంనగర్ కలెక్టర్ – చిత్ర మిశ్రా
17. హన్మకొండ కలెక్టర్ – చాహత్ బాజ్‌పాయ్
18. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ – అంకిత్
19. యాదాద్రి కలెక్టర్ – అనురాగ్ జయంతి
20. జనగాం కలెక్టర్ – సందీప్ కుమార్ ఝా
21. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ – రిజ్వాన్ బాషా షేక్
22. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ – స్నేహ శబర్ష్
23. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ – గరిమా అగర్వాల్
24. వికారాబాద్ జిల్లా కలెక్టర్ – దీపక్ తివారీ
25. వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ – ఉమా శంకర్ ప్రసాద్
26. మెదక్ జిల్లా కలెక్టర్ – ప్రతిమా సింగ్
27. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ – ఫైజాన్ అహ్మద్

## రూ.54 కోట్ల విలువైన భూమికి
# ఫెన్సింగ్

*నెక్నాంపూర్‌లో 2700 గజాల భూమిని కాపాడిన హైడ్రా*



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** కబ్జాల భరతం పడుతున్న హైడ్రా.. నెక్నాంపూర్‌లో ప్రభుత్వ భూమిని కాజేయాలని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంది. ప్రజావసరాలకు ఉద్దేశించిన 2700ల గజాల స్థలాన్ని కాపాడింది. దీని విలు రూ. 54 కోట్ల వరకూ ఉంటుంది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నెక్నాంపూర్ విలేజ్‌లోని 31వ సర్వే నంబరులో 59.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిని సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం 2002లో కేటాయించింది. ఈ మేరకు 2007లో ప్రభుత్వ అనుమతితో హుడా లే ఔట్ వేశారు. ప్లాట్ల కేటాయింపు తర్వాత ఇళ్ల నిర్మాణం జరిగింది. లే ఔట్ ప్రకారం 2700ల గజాలు పార్కుతో పాటు.. ప్రజావసరాలకు అప్పట్లో కేటాయించారు. గుట్టలా ఉండే ఈ స్థలం పార్కు అభివృద్ధికి కాస్త అవరోధంగా ఉంది. కబ్జాదారులకు ఇదే వరమైంది. డా. వై.ఎస్.ఆర్ ఎన్‌క్లేవ్ సెక్రటేరియట్ ఎంప్లాయీస్ కాలనీ రెసెడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కొంతమంది చేతి వాటానికి దారినిచ్చింది. సచివాలయ ఉద్యోగుల కాలనీ నివాసితుల సౌకర్యార్థం వినియోగించాల్సిన భూమి ప్లాట్లుగా మారింది.

**అనుమతి ఒకదగ్గర.. నిర్మాణం మరో దగ్గర..**

సచివాలయ ఉద్యోగుల కాలనీకి ఆనుకుని సర్వే నంబరు 22లో వెంకటేశ్వర కాలనీ ఉంది. ఈ కాలనీలోని ప్లాట్‌ను చూపిస్తూ నిర్మాణ అనుమతి తెచ్చుకున్నారు. పోని అక్కడ ప్లాట్ ఉందా అంటే అదీ లేదు. అక్కడ ప్లాట్‌లో ఇప్పటికే నిర్మాణం జరిగిపోయింది. కాని అదే ప్లాట్‌ను చూపించి అనుమతి తీసుకున్న వ్యక్తి సచివాలయ ఉద్యోగుల కాలనీలోని పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలంలో నిర్మాణాలు చేపట్టాడు. పునాదులతో పాటు.. పిల్లర్లు కూడా వేసి.. ఇక స్లాబ్ వేయడానికి సిద్ధమయ్యాడు. కాలనీ సంక్షేమ సంఘం నేటి ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో పైన పేర్కొన్న అంశాలన్నీ వెలుగు చూశాయి. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు ఆక్రమణలను హైడ్రా బుధవారం తొలగించింది. దీనితో పాటు.. గుట్టను ప్లాట్లుగా చేసి కొంతమంది అప్పటి ప్రతినిధులు అమ్మేసిన మరో 5 ప్లాట్లలో కూడా వేసిన తాత్కాలిక షెడ్డులను తొలగించి మొత్తం 2700ల గజాల మేర ప్రజావసరాలకు ఉద్దేశించిన ప్రభుత్వ స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పబ్లిక్ స్పేస్‌గా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

## ఖనిజరంగంలో
# భారత్ స్వయం సమృద్ధి సాధించాలి

**ప్రభుత్వ, ప్రైవేటు ఖనిజ పరిశ్రమలు కలిసి పనిచేస్తే అగ్రస్థానం మనదే**
**కీలక ఖనిజ రంగ అభివృద్ధికి తన వంతుగా సింగరేణి కృషి**
**నీతి ఆయోగ్ కీలక ఖనిజ కమిటీ సమావేశంలో సభ్యుల అభిప్రాయాలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :** ఖనిజ రంగంలో భారత్ ను స్వయం సమృద్ధి దేశంగా రూపుదిద్దడానికి దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కమిటీ అభిప్రాయపడింది. దేశంలో కీలక ఖనిజాల ఆవశ్యకత, లభ్యత, కీలక ఖనిజాల అన్వేషణ, అందుకు ఉన్న అవకాశాలు, వివిధ ప్రభుత్వ మైనింగ్ సంస్థలు తీసుకోవలసిన చొరవ, బాధ్యతలు ఇతర అంశాలపై లోతుగా చర్చించింది. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో గురువారం కమిటీ భేటీ అయింది. కమిటీ చైర్మన్ డాక్టర్ డీకే. సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ మెంబర్ సెక్రటరీ, నీతి ఆయోగ్, డిప్యూటీ అడ్వైజర్ మినరల్స్ ఆర్. శరవణభవన్, సభ్యులుగా ఉన్న సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, ఇంకా ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడారు. దేశంలో ఉన్న ప్రాథమిక, ద్వితీయ కీలక ఖనిజ వనరులను కనుగొనడానికి ఏర్పాటు చేసిన ఈ కమిటీ దేశ కీలక ఖనిజ అవసరాలు తీర్చడంలో తమ వంతు కృషి చేస్తుందని దీనికి సింగరేణి సంస్థ తన సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ మట్టిలో, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్, బాటమ్ యాష్ లలో దాగి ఉన్న క్రిటికల్ మినరల్స్ ను వెలికితీయడానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. జాతీయ కీలక ఖనిజ అవసరాలు తీర్చడంలో సింగరేణి సంస్థ తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తుందన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోలార్ విద్యుత్తు, బ్యాటరీలతో నడిచే వాహనాలు, ఎలక్ట్రానిక్ రంగ విస్తరణ లో, రక్షణ రంగంలో కీలక ఖనిజాల అవసరం ఎంతో ఉందన్నారు. దేశంలో కీలక




ఖనిజాల వనరులు ఉన్నప్పటికీ, వాటి మైనింగ్ జరగటం లేదని కాబట్టి ప్రస్తుతం విదేశాల నుండి కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటున్నామని కమిటీ అభిప్రాయపడ్డారు. రానున్న కాలంలో కీలక ఖనిజాల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అందుకే దేశంలో ఉన్న కీలక ఖనిజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి ప్రభుత్వ మైనింగ్ సంస్థలు, ప్రైవేటు మైనింగ్ సంస్థలు కలిసి నడవాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు సింగరేణి సంస్థ నుంచి డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు, జీఎం (కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్, జీఎం(ఎక్స్‌ప్లొరేషన్) బి.శ్రీనివాసరావు, ఐఎంఎంటీ, కోల్ ఇండియా, సీఎస్ఐఆర్-సీఈసీఆర్ఐ (కరైకుడి), గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, అదానీ, వేదాంత, లాయిడ్ మెటల్స్, హిందాల్కో, హిందుస్తాన్ జింక్, సన్ టెక్నాలజీస్ (చెన్నై) తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

**కలెక్టర్ సత్య శారద ఆదేశం**
**అభివృద్ధి పనులపై సర్పంచ్ రవి చిన్న రాథోడ్ వినతి**

**నల్లబెల్లి, ఫిబ్రవరి 26 (వుదయం) :** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గురువారం గంగాదేవిపల్లిలో నిర్వహించిన సర్పంచ్‌ల ఒరియెంటేషన్ శిక్షణ కార్యక్రమం సందర్భంగా నల్లబెల్లి మండలం బజ్జుతండ సర్పంచ్ రవి చిన్న రాథోడ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తండాలో ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆమె దృష్టికి తీసుకెళ్లారు.బజ్జుతండాలో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు వంటి కీలక అంశాలపై సర్పంచ్ కలెక్టర్‌తో చర్చించారు. తండాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, అలాగే తండాను స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని కోరారు.సర్పంచ్ విన్నపంపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన పనులతో కూడిన సమగ్ర 'గ్రామ అభివృద్ధి ప్రణాళిక'ను సిద్ధం చేయాలని సూచించారు. నివేదిక సమర్పించిన వెంటనే నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తండాకు చెందిన పలువురు ప్రతినిధులు ఉన్నారు.

## భూదాన్ భూములపై
# ముగ్గురు మంత్రుల కన్ను

**మొదటి పేజీ తరువాయి..**

ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమా? అని ప్రశ్నించారు. శత్రుదేశం మీద దండయాత్రకి పోయినట్లు 4వేల మంది పోలీసులతో పేదల మీద దాడి చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పు చేయకపోతే ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావులను ఇక్కడికి రమ్మనండి అని సవాల్ చేశారు. ఏ తప్పు జరగక పోతే ఆర్డీవోను ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేశారు.. ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకడిని బలి పశువు చేసి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మరోవైపు బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని కేటీఆర్‌కు వివరించారు. వెలుగుమట్లలోని 147, 148, 149 సర్వే నంబర్లలో 60 ఎకరాల భూదాన్ భూమి ఉండాల్సి ఉండగా.. తాము గుడిసెలు నిర్మించుకున్నది కేవలం 30 ఎకరాల్లోనే అని అధికారులు చెప్తున్నారని, మరి మిగిలిన 30 ఎకరాలు ఏమయ్యాయో అడగాలని బాధితులు కేటీఆర్‌ను కోరారు. కాగా, దశాబ్దం క్రితం ఖమ్మం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం నగరానికి వచ్చి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకోవడమే మేము చేసిన పాపమైందా? భూదాన్ భూముల్లో నివాసముంటున్న పేదలపై పెద్దలకు ఎందుకింత కంటగింపు అని బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు.

# ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ ఇక్కడే

**మొదటి పేజీ తరువాయి..**

కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు అడ్మిషన్లలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని మంత్రి తెలిపారు. సివిల్స్, గ్రూప్-1 గ్రూప్-2 కోచింగ్ కోసం మెరిట్ ఆధారంగా పారదర్శక ఎంపిక విధానం ఉంటుందని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లు ఒక హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని మంత్రి తెలిపారు. ఎస్సీ యువతలో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మార్గదర్శకాలు రూపొందించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ ప్రాతినిధ్యం పెరిగేలా ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లను అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్స్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని చెప్పారు. తమిళనాడు మోడల్‌లా అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాలు నిర్మాణం చేస్తామన్నారు. పేద విద్యార్థి నుంచి ఒక మంచి అడ్మినిస్ట్రేటర్‌గా (పరిపాలకుడిగా) తీర్చిద్దిదాలనే అనే సంకల్పంతో మా ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అలాగే మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# భారత - ఇజ్రాయెల్ సంబంధాలకు ప్రత్యేక వ్యూహాత్మక స్థాయి

**మొదటి పేజీ తరువాయి..**

విద్యలో ఖచ్చితత్వం గురించి మనం మాట్లాడేటప్పుడు, ప్రతి యువ విద్యార్థిని చేరుకోవడానికి , వారు తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి వీలుగా ఇప్పుడు మన దగ్గర సాఫ్ట్‌వేర్, ఎఐ ఉన్నాయి. గతంలో మనల్ని నిర్బంధించిన పరిమితులు ఇకపై మనల్ని బంధించవు.. భవిష్యత్తు అనేది కొత్త ఆవిష్కరణలు చేసే వారిదే. ఇజ్రాయెల్, భారతదేశం ఆవిష్కరణల వైపు మొగ్గు చూపుతున్నాయి. గర్వపడే పురాతన నాగరికతలను కలిగి ఉన్నవారం, గతం గురించి చాలా గర్వంగా ఉన్నాం. అదే సమయంలో భవిష్యత్తును స్వాధీనం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నాం. మనం కలిసి ఆ పని మెరుగ్గా చేయగలం, అని ఆయన అన్నారు.

**నెసెట్ సత్కారం భారతీయులకు అంకితం.. మోడీ..**

ఆత్మీయ స్వాగతం పలికినందుకు మోడీ నెతన్యాహుకు కృతజ్ఞతలు తెలిపారు. తన గత ఇజ్రాయెల్ పర్యటనను గుర్తు చేసుకున్నారు. షాలోమ్! నాకు, నా ప్రతినిధి బృందానికి హృదయపూర్వక స్వాగతం పలికినందుకు ప్రధాని నెతన్యాహుకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. తొమ్మిది సంవత్సరాల కింద, మొదటిసారి ఇజ్రాయెల్‌ను సందర్శించే అవకాశం నాకు లభించింది. 9 సంవత్సరాల తర్వాత, మళ్ళీ ఇజ్రాయెల్‌ను సందర్శించడం నాకు గర్వకారణం. నిన్న, నాకు స్పీకర్ ఆఫ్ ది నెసెట్ మెడల్ ను అందచేశారు. ఈ అవార్డును 140 కోట్ల మంది భారతీయులకు, భారత్-ఇజ్రాయెల్ స్నేహానికి అంకితం చేస్తున్నాను, అని ఆయన అన్నారు.

**పర్యటన అసాధారణ ఫలవంతం.. నెతెన్యాహు..**

మోదీ పర్యటన చాలా ప్రభావవంతమైనది, ఫలవంతమైనదని నెతెన్యాహు అభివర్ణించారు. ఇది అద్భుతమైన పర్యటన. ఆ అద్భుతమైన పర్యటనకు అద్భుతమైన ముగింపు. ఇది క్లుప్తమైందే కానీ అసాధారణంగా ఉత్పాదకమైనది, అసాధారణంగా హృదయాన్ని కదిలించేది. నిన్న నెసెట్‌లో మీరు చేసిన హృదయపూర్వక ప్రకటన తర్వాత ఇజ్రాయెల్‌లో చెమర్చని కళ్లు లేవని నేను భావిస్తున్నాను. అప్పటి నుంచి మన హృదయాలను లోతుగా పరిశీలించడమే కాకుండా, మన రెండు దేశాలలో మనకు ఉన్న అద్భుతమైన మనస్సులను, మెదడులను కూడా పరిశీలించే అవకాశం మనకు లభించిందని నేను మీకు చెప్పగలను, అని ఆయన అన్నారు.



# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై కమిటీ

**మొదటి పేజీ తరువాయి..**

ఇదీలావుంటే.. ఎన్నికల హామీల జాప్యంపై ఇటీవల స్పందించిన రాష్ట్ర హైకోర్టు.. వాటి అమలులో ఉన్న ఇబ్బందులతో పాటు ఎప్పటిలోగా మెనిఫెస్టో హామీలు అమలు చేస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై దృష్టిసారించినట్లు తెలుస్తున్నది. కాగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభయహస్తం పథకం కింద ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, నెలకు సుమారు రూ.25వేల పెన్షన్, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు పెన్షన్లు, ఇండ్ల స్థలాలు కల్పించాలన్న హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ ఉద్యమ జేఏసీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఉద్యమకారులు దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు నాలుగు రోజుల క్రితం విచారణ జరిపింది. అభయహస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన తెలంగాణ ఉద్యమకారులకు ఎనిమిది వారాల్లోపు ఇండ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు ఫ్రీడమ్ ఫైటర్ శాఖ అధికారులకు జస్టిస్ విజయసేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. అర్హతల పరిశీలనలో ఆలస్యం చేయకుండా, విధివిధానాల ప్రకారం కేసులను పరిష్కరించి ప్రయోజనాలు అందించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తాజాగా మంత్రి వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది.



# జాతీయం- అంతర్జాతీయం



## చర్చలు ఫలవంతం

### యుఎస్ వాణిజ్య కార్యదర్శి లుట్నిక్‌తో చర్చలపై కేంద్ర మంత్రి

**ముంబై, ఫిబ్రవరి 26 (వుదయం):**

యుఎస్ వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్, భారత్‌కు అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో అత్యంత ఫలవంతమైన చర్చలను జరిపినట్టు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ గురువారం పేర్కొన్నారు. భారత్, అమెరికాల మధ్య వాణిజ్యాన్ని విస్తరించడం, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడంపై ఈ సమావేశం దృష్టి పెట్టింది. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను గోయల్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ పై పంచుకున్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింతగా పెంచడం, సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ చర్చలు జరిగినట్టు ఆయన తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించి, బలమైన ఆర్థిక భాగస్వామ్యం చుట్టూ ఈ చర్చలు జరగాయని గోయల్ అన్నారు. ప్రపంచ వాణిజ్యంలో తన ఉనికిని పెంచుకోవడానికి, భారతీయ వ్యాపారాలకు అంతర్జాతీయ మార్కెట్ల అందుబాటును మెరుగుపరచడానికి భారతదేశం చురుకుగా పనిచేస్తోంది.ప్రభుత్వం భారతీయ కంపెనీలను ప్రపంచ విలువ గొలుసులలో భాగం కావాలని, విదేశాలలో కొత్త అవకాశాలను అన్వేషించాలని కూడా ప్రోత్సహిస్తోంది.

**విస్తరిస్తున్న భారత్ వాణిజ్య నెట్‌వర్క్**

దాదాపు 38 దేశాలతో భారత్ తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టిఎ)లపై సంతకాలు చేసిందని గోయల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందాలు భారతీయ వ్యాపారవేత్తలకు మెరుగైన మార్కెట్ల అందుబాటు, ప్రాధాన్యతా వాణిజ్య ప్రయోజనాలను కల్పిస్తాయని అన్నారు.

భారతీయ సరుకులు, సేవలు, వ్యవసాయ ఉత్పత్తు



లు, మత్స్య సంపద నూతన గ్లోబల్ మార్కెట్లకు చేరడానికి ఈ ఎఫ్‌టిఎలు తోడ్పడుతున్నాయని ఆయన అన్నారు. అవి శ్రమఆధారిత రంగాలకు మద్దతు ఇస్తుండడమే కాక నైపుణ్యం కలిగిన నిపుణులకు చలనశీలతను మెరుగుపరుస్తున్నాయి.

**ప్రపంచ సంబంధాల ద్వారా ఆత్మనిర్భర్ భారత్**

ఆత్మనిర్భర్ భారత్ దార్శనికత మనను మనం ప్రత్యేకంగా, వంటరిగా ఉంచుకోవడం గురించి కాదని గోయల్ స్పష్టం చేశారు. బదులుగా, ఇది ప్రపంచ భాగస్వామ్యాల ద్వారా బలమైన, విశ్వసనీయమైన, వైవిధ్యభరితమైన సరఫరా లంకెలను నిర్మించడంపై దృష్టి పెడుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఎంఎస్‌ఎంఇలు, రైతులు, ఎగుమతిదారులు, మత్స్యకారులకు ప్రపంచ స్థాయి అవకాశాలను కల్పించాలని వ్యవస్థాపకులు, పరిశ్రమ నాయకులను ఆయన కోరారు.

**భారత్ భవిష్యత్తుపై విశ్వాసం**

ఇటీవల ముంబైలో జరిగిన 27వ ఇవై ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుల కార్యక్రమంలో గోయల్ మాట్లాడుతూ, భారతదేశ వృద్ధి కథను దాని వ్యవస్థాపకులు,యువత ముందుకు నడిపిస్తారని అన్నారు. 'అమృత కాలం' లో యువ భారతదేశం దేశానికి మార్గనిర్దేశం చేస్తుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి సహాయపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఇజ్రాయెల్- భారత్ మధ్య పెరుగుతున్న బంధం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (వుదయం):**

ప్రధాని నరేంద్ర మోడీ రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటన ముగిసింది. భారత ప్రధాని



### 2017లో మోడీ పువ్వు నుంచి 2026లో నెసెట్ మెడల్ వరకూ..



అయిన తర్వాత ఆ దేశంలో ఆయన పర్యటించడం ఇది రెండవ సారి. బుధవారం బెన్‌గురియన్ విమానాశ్రయంలో ఆయనకు ఇజ్రాయెలీ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ సాదరంగా ఆహ్వానం పలికారు.

**పుష్పానికి మోడీ పేరు**

ప్రధాని 2017లో చేసిన తొలి పర్యటన గుర్తున్నవారికి ఈ పర్యటన దానిని గుర్తు చేస్తుంది. ఆ సమయంలో ఆయన డాంజిగర్ పుష్పవనంలో ఆగినప్పుడు, ఆయన గౌరవార్థం త్వరగా ఎదిగే ఒకరకం చేమంతి పువ్వుకు మోడీ అని ఇజ్రాయెల్ పేరు పెట్టింది. ఇది చాలా అరుదైన, ప్రత్యేక దౌత్యపరమైన చర్య. ఇది ఇరు దేశాల మధ్యగల సన్నిహిత స్నేహాన్ని ప్రదర్శించింది. ఈ పువ్వు బిరబిరపెరగడానికే కాదు, ప్రకాశవంతమైన రంగుకు ప్రసిద్ధి చెందింది. దీనిని భారత్ ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న బలమైన సంబంధాల గుర్తుగా చూస్తారు.

**నెసెట్‌లో ప్రధాని మోడీ ప్రసంగం**

దాదాపు తొమ్మిది సంవత్సరాల తర్వాత, ఆ బంధం మరింత బలపడింది. తొలి రోజే, ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పార్లమెంట్ అయిన నెసెట్ ప్రత్యేక సమావేశంలో ప్రసంగించారు. దీనితో నెసెట్‌లో ప్రసంగించిన తొలి భారతీయ నాయకుడయ్యారు. తన ప్రసంగంలో, అక్టోబర్ 7 నాటి అనాగరిక ఉగ్రవాదాన్ని ఆయన ఖండించారు. ఈ క్షణంలో, ఆ తర్వాత కూడా ఇజ్రాయెల్‌తో భారత్ దృఢంగా నిలుస్తుందని ప్రకటించారు. పంచుకున్న విలువలు, స్నేహం, గౌరవం, భాగస్వామ్యం గురించి మాట్లాడారు. శాసనసభ్యులు తమ స్థానాల నుంచి లేచి నిలబడి కరతాళ ధ్వనులే కాక, "మోడీ, మోడీ" అని నినాదాలు చేయడం విశేషం. సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఆయన పాత్రకు గాను ఇజ్రాయెల్ పార్లమెంట్ నుండి అత్యున్నత గౌరవం అయిన ప్రతిష్ఠాత్మక మెడల్ ఆఫ్ ది నెసెట్‌ను ప్రదానం చేశారు. రెండవ రోజు, ఆయన నెతన్యాహూతో కలిసి నివాళులు అర్పించేందుకు హోలోకాస్ట్ మెమోరియల్ అయిన యాదవాషెంను సందర్శించారు. అనంతరం వారు రక్షణ, సాంకేతికత, ఇతర ఒప్పందాల గురించి చర్చించారు. భద్రతను, ఆర్థిక వ్యవస్థను, ఆవిష్కరణల సహకారాన్ని పెంచుకునేందుకు మార్గాలను నాయకులు చర్చించారు.

## రాజ్యసభకు నామినేషన్లు ప్రారంభం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:**

భారత ఎన్నికల సంఘం 15 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంతో గురువారం ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. మహారాష్ట్రలో ఏడు స్థానాలు, తమిళనాడులో ఆరు, బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో ఐదు చొప్పున, ఒడిషాలో నాలుగు, అస్సాంలో మూడు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, హర్యానాలలో రెండు చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకస్థానానికి మార్చి 16న ఓటింగ్ జరుగనుంది. వివిధ రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుల పదవీ కాలం ముగియనుండటంతో ఈ ఖాళీలను భర్తీ చేయనున్నారు.

**ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ :**

**నామినేషన్ల ప్రారంభం:** గురువారం నుంచే అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చు.

**నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ :** మార్చి 5.

**పరిశీలన :** దాఖలైన నామినేషన్లను మార్చి 6న అధికారులు పరిశీలిస్తారు.

**ఉపసంహరణ:** పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులకు మార్చి 9 వరకు అవకాశం కల్పించారు.

**పోలింగ్, ఫలితాలు:** ఒకవేళ అవసరమైతే (ఏకగ్రీవం కాని పక్షంలో) మార్చి 16న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

## ఆపరేషన్ సిందూర్ 2.0 కఠినం

**భారత సైన్యం వెస్ట్రన్ కమాండ్**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (వుదయం): దాదాపు 26మంది మరణానికి దారితీసిన పహల్‌గాంవ్ తీవ్రవాద దాడి అనంతరం గత ఏడాది మేలో భారత సైనిక దళాలు ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాకిస్తాన్‌లో, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో తీవ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు.ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్‌కు బలమైన సందేశాన్ని ఇవ్వగా, ఆపరేషన్ సిందూర్ 2.0 కొనసాగుతోందని, ఈసారి దాని సన్నాహక స్థాయి భారీగా ఉందని 2 కోర్స్ కి చెందిన జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జిఒసి) లెఫ్టనెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ పేర్కొన్నారు. గత ఏడాది మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌ను గుర్తు చేసుకుంటూ, కేవలం నాలుగు రోజుల్లోనే పాకిస్తాన్‌కు కఠినమైన సందేశాన్ని భారత్ ఇచ్చిందని, ఆ దేశాన్ని మోకాళ్ల పైకి తెచ్చిందని అన్నారు.

ఆ ఆపరేషన్‌లో మేం పాకిస్తాన్‌కు చాలా చిన్న శాంపుల్ చూపించాము. కేవలం నాలుగు రోజుల్లోనే, వారిని మోకాళ్ల పైకి తెచ్చాం. దానితో మా డిజిఎంఒకు ఫోన్ చేసి ఈ యుద్ధాన్ని ఆపమని అడిగారు. ఇది చాలా చిన్న ఉదాహరణ, దాని ఉద్దేశం శిక్షణ అని లెఫ్టినెంట్ జనరల్ పుష్కర్ విలేకరులతో అన్నారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో వెస్ట్రన్ కమాండ్ హైప్రొఫైల్ ఆపరేషనల్ కెపాబిలిటీ డెమోన్‌స్ట్రేషన్ సందర్భంగా ఆ అధికారి మాట్లాడారు. ఉగ్రవాదం పట్ల భారతదేశం అనుసరిస్తున్న "జీరో టాలరెన్స్ పాలసీ"కి అనుగుణంగా ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గతంలో పునరుద్ఘాటించారు. మేం ఎటువంటి బలమైన చర్య తీసుకోకుండా ఆయన (షెహబాజ్ షరీఫ్) నిరోధించాలనుకుంటున్నారు. ఇది ఆయన చేస్తున్న ఒక రకమైన మోసం, దీనిని మనం బహిరంగంగా చెప్పాలి. ఆయన అణు దాడితో మేం నిరుత్సాహపడం అని ఆయన చెప్పినట్టు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది. ఆపరేషన్ సిందూర్ 2 కోసం సన్నాహాలు చాలా విస్తృతంగా ఉన్నాయి.

ఈ ఆపరేషన్ ఎలా జరుగుతుందో నేను ఇప్పుడే మీకు చెప్పలేను. ఎందుకంటే ఇది శత్రువుకు మనం ఎంత నష్టం కలిగించాలనుకుంటున్నామో అనేదానిపై ఆధారపడి ఉంటుంది. అది ఏదైనా రకమైన నష్టం అయినా, మేము దానిని నిర్వహించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాము అని ఆయన వివరించారు.

**అణ్వాయుధ దాడులనే అబద్ధానికి వెనక్కి తగ్గం:**

మరో సీనియర్ సైనిక అధికారి కూడా ఈసారి పాకిస్తాన్ నుండి వచ్చే ఏదైనా రెచ్చగొట్టడం వల్ల బలమైన ప్రతీకారం తీర్చుకోవచ్చని అన్నారు. పాకిస్తాన్ అణు దాడులనే బెదిరింపుతో భారతదేశం ఇకపై నిరుత్సాహపడదని వెస్ట్రన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ అన్నారు. భారత సైన్యం బలమైన చర్య తీసుకోకుండా పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిరోధించాలనుకుంటున్నారు అని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వెస్ట్రన్ కమాండ్ సాధించిన విజయాన్ని లెఫ్టినెంట్ జనరల్ కటియార్ మరింత పట్టి చూపుతూ, భారత సైన్యం గతంలో కంటే... కఠినంగా స్పందించాలి అని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో, మేము వారి (పాకిస్తాన్) ఉగ్రవాద స్థావరాలన్నింటినీ దాడి చేసాం. ఆ తర్వాత, వారు ప్రతీకారం తీర్చుకున్నారు, ప్రతిస్పందనగా, మేం వారి సైనిక స్థావరాలను, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసాం. అప్పుడు వారు కాల్పుల విరమణను డిమాండ్ చేశారు. మా నుండి నేరుగా కాకుండా, ఇతర దేశాల నుండి కూడా భారతదేశంతో కాల్పుల విరమణను కోరారు, అని ఆయన అన్నారు.

## బంగ్లాదేశ్ అధ్యక్షుడిపై ప్రతిపక్ష జమాత్ నేత విమర్శలు

**ఢాకా, ఫిబ్రవరి 26 :**

షేక్ హసీనా 2024లో పదవీచ్యుతురాలైన తర్వాత, మహమ్మద్ యూనస్ పాలనలో తనకు ఎదురైన అవమానం గురించి బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ మాట్లాడిన కొద్ది రోజులలోనే బంగ్లాదేశ్ అతివాద జమాత్ ఎ ఇస్లామీ పార్టీ నాయకుడు షఫీకుర్ రెహమాన్ ఆయన పై తీవ్ర దాడికి దిగారు. బంగ్లాదేశ్ పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన ఆయన, ఆగస్టు 5, 2024 నాటి ఘటనలకు సంబంధించిన కీలక వాస్తవాలను బయటపెట్టడానికి దేశాధ్యక్షుడు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. బంగాలి ప్రచురణ అయిన కలేర్ కాంథోకు షాబుద్దీన్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూను రెహమాన్ ప్రస్తావిస్తూ,ఆగస్టు 5, 2024 గురించి అధ్యక్షుడు అనేక వాస్తవాలను దాచిపెట్టారు అని అన్నారు. పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి రాజీనామా గురించి ఆ రోజు అక్కడ ఉన్న నాయకులకు ఆయన చెప్పినది, తరువాత ఆయన దేశానికి తెలియజేసినది ఆయన ప్రస్తుత వ్యాఖ్యలలో ప్రతిబింబించడం లేదు. ఆయన ఇప్పుడు చెబుతున్నది ఆ రోజు చెప్పినది కాదు అని షేక్ హసీనా రాజీనామా వివాదం గురించి ప్రస్తావిస్తూ అన్నారు.

ఆ రోజు లక్షలాది మంది ప్రజలు విన్న దానికి, ఆయన అప్పుడు చెప్పిన దానికి, ఇప్పుడు చెబుతున్న దానికి అధ్యక్షుడు పొంతన పెట్టగలరా? అని రెహమాన్ ప్రశ్నించారు.

దేశం అమాయకమైంది కాదు. రాష్ట్ర అత్యున్నత కార్యాలయం నుండి ఇటువంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు అని ఆయన అన్నారు.



**యూనస్-జమాత్ సంబంధం?**

మాజీ ప్రధాన సలహాదారు, నోబెల్ గ్రహీత మొహమ్మద్ యూనస్ తనను రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో పదవి నుండి తొలగించడానికి కుట్ర పన్నారని షహాబుద్దీన్ ఆరోపించిన కొన్ని రోజుల తర్వాత అధ్యక్షుడిపై రెహమాన్ విమర్శలు వచ్చాయి. యూనస్ పదవీకాలంలో బంగ్లాదేశ్‌ను అస్థిరపరిచి రాజ్యాంగ శూన్యతను సృష్టించడానికి ప్రయత్నాలు జరిగాయని షహాబుద్దీన్ పేర్కొన్నారు.

అధ్యక్షుడిని విమర్శించడం ద్వారా, జమాత్ చీఫ్ అనుకోకుండా బంగ్లాదేశ్‌లోని ఇస్లామిస్ట్ గ్రూపులకు, యూనస్ తాత్కాలిక పాలనకు మధ్య ఉన్న సంబంధాన్ని బయటపెట్టారు.

ఆగస్టు 2024 తిరుగుబాటు తరువాత యూనస్ తన 18 నెలల పదవీకాలంలో రాడికల్ ఇస్లామిస్ట్ శక్తులను ప్రోత్సహించడం, మద్దతు ఇవ్వడం లేదా అధికారం ఇవ్వడం వంటి ఆరోపణలను పదవీచ్యుతురాలైన హసీనా, ఆమె అవామీ లీగ్ పార్టీ, వివిధ విశ్లేషకుల నుండి ఎదుర్కొన్నాడు.

**హసీనా రాజీనామా వివాదం**

ఆగస్టు 5, 2025న హసీనా బంగ్లాదేశ్ నుండి పారిపోయిన కొన్ని గంటల తర్వాత, షహబుద్దీన్ ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో హసీనా రాజీనామా లేఖను తనకు ఇచ్చిందని, తాను దానిని అందుకున్నాను అని అన్నారు. యూనస్ తాత్కాలిక పాలన ఏర్పాటును చట్టబద్ధం చేయడానికి హసీనా రాజీనామా రాజ్యాంగబద్ధంగా అవసరం.

అయితే, రెండు నెలల తర్వాత, హసీనా రాజీనామా గురించి తాను విన్నాను కానీ ఆమె రాజీనామా చేసిందా లేదా అనేదానికి ఎటువంటి ఆధారాలు లేవని అధ్యక్షుడు పేర్కొన్నారు. నేను చాలాసార్లు రాజీనామా లేఖను సేకరించడానికి ప్రయత్నించాను కానీ విఫలమయ్యాను. బహుశా ఆమెకు సమయం లేకపోవచ్చు అని ఆయన అక్టోబర్ 2024లో బంగ్లాదేశ్ దినపత్రిక జనతార్ చోఖ్‌తో అన్నారు.

ఆయన వైఖరిలో వచ్చిన మార్పే ఆయనను తొలగించాలనే పిలుపుకు దారితీసింది. అయితే ఆయన దాని నుంచి బయటపడగలిగారు. బంగ్లాదేశ్ అధ్యక్షుడు యూనస్ పాలన తనను పదే పదే అత్యున్నత పదవి నుండి తొలగించడానికి ప్రయత్నించిందని ఆరోపించారు.

## ఎంఒయుపై భారత్-నేపాల్ సంతకాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:**



అడవులు, వన్యప్రాణులు, పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పు వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని ప్రోత్సహించడానికి... వన్యప్రాణుల కారిడార్లు, పరస్పర అనుసంధాన ప్రాంతాల పునరుద్ధరణ, విజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం, ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి... భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ బుధవారం నేపాల్ ప్రభుత్వ అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖతో ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) పై సంతకాలు చేసింది. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, నేపాల్ ప్రభుత్వ అటవీ, పర్యావరణ మంత్రి మాధవ్ ప్రసాద్ చౌలగైన్‌ల సమక్షంలో న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవగాహన ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. భారత్‌నేపాల్ దేశాలు గొప్ప జీవవైవిధ్యం, ప్రకృతి పరమైన వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. వాటి సంబంధిత భూభాగాల్లో విస్తృతమైన రక్షిత ప్రాంతాల నెట్‌వర్క్‌లను ఇరు దేశాలూ ఏర్పాటు చేశాయి. అనేక బహుపాక్షిక పర్యావరణ ఒప్పందాలు, సదస్సులలో ఇరు దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. భాగస్వామ్య పర్యావరణ వ్యవస్థలు, సరిహద్దుల మీదుగా ఉన్న వన్యప్రాణుల ఆవాసాల దృష్ట్యా అడవులు, వన్యప్రాణులు, పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పు రంగాల్లో ఇరు దేశాల ప్రభుత్వాల మధ్య సమన్వయం, సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఇరు దేశాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

ఏనుగు, గంగా డాల్ఫిన్, ఖడ్గమృగం, మంచు చిరుత, పులి, రాబందులు వంటి కీలక జాతుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రకృతి దృశ్య స్థాయిలో జీవవైవిధ్య పరిరక్షణ వ్యూహాలను రూపొందించడంలో సహకారాన్ని ఈ అవగాహన ఒప్పందం పెంపొందిస్తుంది. ఇది బలోపేతమైన అటవీ, రక్షిత ప్రాంతాల నిర్వహణ... సరిహద్దుల మధ్య రక్షిత ప్రకృతి దృశ్యాలను సృష్టించే దిశగా కారిడార్లు, ఇతర పరస్పర అనుసంధాన ప్రాంతాల పునరుద్ధరణ... జీవవైవిధ్య పరిరక్షణ ముప్పులను పరిష్కరించడం... అటవీ, వన్యప్రాణులకు సంబంధించిన నేరాలను అరికట్టడం... అమలు సంస్థల ఫ్రంట్‌లైన్ సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందించడం... జీవవైవిధ్య హాట్‌స్పాట్‌లలో స్మార్ట్ గ్రీన్ మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈ ఒప్పందంలో ప్రధానంగా దృష్టి సారించారు.

ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం వల్ల వన్యప్రాణుల, జీవవైవిధ్య పరిరక్షణలో భారత్‌నేపాల్ సహకారం మరింత బలోపేతమవుతుందని... ఉమ్మడి పర్యావరణ వ్యవస్థల రక్షణకు, ఈ ప్రాంతంలోని సహజ వనరుల స్థిరమైన నిర్వహణకు ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు.

## క్షమాపణతో వదిలేయలేం: సుప్రీం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (వుదయం):**


ఎన్‌సిఇఆర్‌టి ఎనిమిదో తరగతి సోషల్ సైన్స్ పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే వివాదాస్పద విభాగం చేర్చడంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు గురువారం తీవ్రంగా తప్పుబట్టింది.

ధర్మాసనం ముందు హాజరైన మెహతా, ఈ విషయానికి బాధ్యులను భవిష్యత్తులో పాఠ్యపుస్తకంలో జోక్యం చేసుకోనివ్వమని అన్నారు. ఆ భాగం సమర్థనీయం కాదని అంగీకరించారు. అయితే, కేవలం ఆ విషయాంశాన్ని తొలగించడం సరిపోదని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టం చేశారు.

**న్యాయవ్యవస్థ రక్తంచిందిస్తోంది: సిజెఐ తీవ్ర వ్యాఖ్యలు**

పుస్తకం ఇప్పటికే మార్కెట్‌కు చేరుకుందని పేర్కొంటూ, ఆ భాగాన్ని ఉపసంహరించుకోవడం లేదా క్షమాపణ చెప్పడం సరిపోదని సిజెఐ వ్యాఖ్యానించారు. కేవలం క్షమాపణ చెప్పి అధికారులను వదిలేయలేం. దానిని తొలగిస్తున్నామని చెప్పడం సరిపోదు. పుస్తకం ఇప్పటికే పంపిణీ చేశారు. నేను కూడా ఒక కాపీని చూశాను" అని ఆయన అన్నారు.

### 8వ తరగతి పాఠ్యాంశమై ఎన్‌సిఆర్‌టిపై మండిపాటు



కేవలం 32 కాపీలు మాత్రమే పంపిణీ చేశారని, పిల్లలకు సానుకూల విలువలను బోధించాలని మెహతా చెప్పినప్పుడు, సిజెఐ ఈ సమస్య చాలా తీవ్రమైందని ప్రతిస్పందించారు. ఈ పుస్తకంలో అంశాన్ని చేర్చడం ప్రణాళికాబద్ధమైన చర్యగా ఆయన అభివర్ణించారు, ఈ పుస్తకాన్ని పిల్లలు మాత్రమే కాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విస్తృత సమాజం కూడా చదువుతారని నొక్కి చెప్పారు.

**కొనసాగనున్న విచారణ, షోకాజ్ నోటీసులు జారీ**

కోర్టు సంతృప్తి పడే వరకూ విచారణను ముగించబోమని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. దీని వెనుక ఉన్నది ఎవరో మేం తెలుసుకోవాలి. మేం సంతృప్తిపడే వరకూ, ఈ వ్యవహారం కొనసాగుతుందని ఆయన అన్నారు.

పౌరుల హక్కులను పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ పాత్రను పాఠ్యపుస్తకంలో విస్మరించారని ఆయన పేర్కొన్నారు. న్యాయం పొందడం, న్యాయ సహాయం అందించడం మెరుగుపరచడానికి తీసుకున్న వివిధ చర్యలను, అలాగే ప్రజా జీవితంలో అవినీతికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు జారీ చేసిన అనేక మైలురాయి ఆదేశాలను కోర్టు పట్టి చూపింది. ఈ భాగం మంచి ఉద్దేశ్యంతో రాసినట్లు కనిపించడం లేదని సిజెఐ పేర్కొన్నారు. కోర్టు మంచి విశ్వాసంతో చేసిన న్యాయమైన విమర్శలను అణచివేయడానికి ప్రయత్నించదని స్పష్టం చేస్తూనే, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడుకోవడం చాలా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. చిన్న పిల్లలకు ఏకపక్ష కథనాన్ని అందించడం వారి మనస్సులను ప్రభావితం చేస్తుందని ఆయన అన్నారు. ఉద్దేశపూర్వకంగా న్యాయవ్యవస్థ పట్ల అగౌరవాన్ని వ్యాప్తి చేయడం నేరపూరిత ధిక్కారానికి దారితీస్తుందని కూడా ఆయన హెచ్చరించారు.

**క్షమాపణ నిజాయితీగా చెప్పారా లేదా అని పరిశీలించాలి**

పుస్తక పంపిణీని నిలిపివేసి, దానిని ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంటూ విద్యా శాఖ ఒక పత్రికా ప్రకటన జారీ చేసిందని ధర్మాసనానికి సమాచారం అందింది. ఆ ప్రకటనలో విచారం కూడా వ్యక్తం చేశారు. అయితే, క్షమాపణ నిజాయితీగా చెప్పారా లేదా అని కోర్టు పరిశీలించాలని సిజెఐ అన్నారు.

పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి, ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేష్ సక్లానీ వివరణ కోరుతూ సుప్రీంకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పుస్తకాన్ని స్వాధీనం చేసుకుని, దాని ఆన్‌లైన్ పిడిఎఫ్ వెర్షన్‌ను తొలగించడంతో సహా పుస్తకం ప్రజలకు అందుబాటులోకి రాకుండా చూడాలని కోర్టు ఆదేశించింది.

### విద్యామంత్రి స్పందన

వివాదాస్పదమైన కొత్త పాఠ్య పుస్తకం విషయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. ఆ పుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' అంటూ ఒక అధ్యాయాన్ని ప్రచురించడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి, ఆ పుస్తకాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచారం వ్యక్తం చేశారు.

ఈ విషయం తన దృష్టికి రాగానే ఆ పుస్తకాలు సర్క్యులేషన్‌లో లేకుండా వెనక్కి తీసుకోవాలని ఎన్‌సిఇఆర్‌టిని ఆదేశించాను. న్యాయ వ్యవస్థను అగౌరవపర్చాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. మేం న్యాయవ్యవస్థకు అత్యున్నత గౌరవం ఇస్తాం. కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. జరిగినదాని పట్ల చింతిస్తున్నాను. ఎన్‌సిఇఆర్‌టిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకుంటాం అని మంత్రి వెల్లడించారు. ఈ పుస్తకంలోని అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు ఇప్పటికే సుమోటోగా విచారణకు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇదంతా న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇక ఇప్పటికే ఎన్‌సీఈఆర్‌టీ ఆ పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అసంబద్ధమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.






"నిధుల కోసం కేంద్రం మీద అతిగా ఆధారపడకుండా రాష్ట్రాలు తమ సొంత వనరులను కల్పించుకోవాలి. మధ్యతరహా సైజు భూ కమతాలను పరిమిత శిస్తు పరిధిలోకి తీసుకు రావచ్చు. ఈ చర్య రాష్ట్రాల ఆదాయాన్ని పెంచుతుంది. ఇంతవరకు ఉపయోగించని లేదా స్వల్ప ఉపయోగంలోకి మాత్రమే వచ్చిన పన్ను విధింపు హక్కులను స్థానిక సంస్థల రాబడిని పెంచడానికి రాష్ట్రాలు ఉపయోగించుకోవచ్చు. కేంద్రం నుంచి వచ్చే నిధులమీదనే అవి ఆధారపడడం మంచిదికాదు. ఇతర దేశాలతో పోల్చుకుంటే మన దేశంలో స్థానిక సంస్థలకు అతి తక్కువ నిధులను కేటాయిస్తున్నాము.

**- మాంటిక్ సింగ్ అహ్లువాలియా, ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ ఛైర్మన్**"

## వే'మన'పద్యం

**తమకుగల్గు పెక్కు తప్పులునుండగా**
**ఓగు నేరమెంచు నొరులగాంచి**
**చక్కిలంబుగాంచి జంతిగ నగినట్లు**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# ఇజ్రాయెల్ తో మరింత సాన్నిహిత్యం

దక్షిణాసియా లోని ఇండియాకు పశ్చిమాసియా లోని ఇజ్రాయెల్ కు మధ్య కయ్యం ఎప్పుడూ లేదు అలాగని విడదీయ వీలు లేని వియ్యమూ లేదు. దేశాల మధ్య సంబంధాలకు ఎల్లలే లేని ఈ రోజుల్లో ఇజ్రాయెల్ తో అనుబంధంలో చాలకాలం స్తబ్దత ఎందుకు రాజ్యం చేసింది అనే ప్రశ్నకు సమాధానం చాలా మందికి తెలుసు.ఇజ్రాయెల్ అవతరణలోనే ఈ స్తబ్దత మూలాలున్నాయి.పాలస్తీనా ను ఇజ్రాయెల్ – పాలస్తీనా గా విభజించడాన్ని 1947 లో అప్పుడే స్వాతంత్ర్యం పొందిన ఇండియా వ్యతిరేకించింది. జర్మనీ లో హిట్లర్ చేతిలో నానా బాధలు, ప్రాణాంతక అణచి వేతను అనుభవించిన యూదులంటే విశేష సానుభూతి ఉన్నప్పటికీ, వారి దేశాన్ని పాలస్తీనా లో నెలకొల్పడాన్ని స్వాతంత్ర్య ఉద్యమం నాటి భారత నాయకత్వం వ్యతిరే కించింది.1949 లో ఇజ్రాయెల్ కు సమితిలో సభ్యత్వం ఇవ్వడాన్ని కూడా వ్యతిరేకించింది.అయితే ఇజ్రాయెల్ అదేపనిగా ఇండియాతో సత్సంబంధాలను కోరుకో వడంతో 1950లో దాని సార్వభౌమత్వాన్ని భారత్ గుర్తించింది . అయినా గాంధీ –నెహ్రూల వారసులు భారత పాలకులుగా కొనసాగినంతకాలం ఇజ్రాయెల్ తో సంబంధాలు పలచగానే సాగాయి. హిందుత్వ వాదులు ఇజ్రాయెల్ కు దాని అవతరణ నాటి నుంచి హృదయపూ ర్వకంగా మద్దతు ఇస్తున్నారు.అందుచేత ప్రధాని మోడీ హయాంలో రెండు దేశాల మధ్య సంబంధాలు అత్యున్నత స్థాయికి చేరుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. పాలస్తీనా విభజన పరంగా ఇజ్రాయెల్ తో యుద్ధాలు చేసిన అరబ్ దేశాలలో కొన్నింటిని అమెరికా అబ్రహం ఒప్పందాల ద్వారా ఇజ్రాయెల్ కు చేరువ చేసింది. ఆయిల్ సంపన్న అరబ్ దేశాలతో పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలను కాపాడుకుంటున్న ప్రధాని మోడీ ప్రభుత్వం ఇజ్రాయెల్ తోనూ స్నేహం నెరపడం గడసాము వంటి నేర్పరితనమే.ప్రధానంగా లెక్కలేనంతమంది పసికందులు సహా 70000 మందికి పైగా పాలస్తీనీ యులను ఇజ్రాయెల్కు దళాలు కబళించిన గాజా మహా మారణ అమానవ అధ్యాయంలో మోడీ ప్రభుత్వం చాలా ఇరకాటమైన పరిస్థితిని ఎదుర్కొన్నది. ఆయుధాలు ఇచ్చిపుచ్చు కోవడంలో ఇండియా –, ఇజ్రాయెల్ పురోగ మిస్తున్నాయి. విద్య వ్యవసాయ రంగాల్లో పరస్పరం సహక రించుకుంటున్నాయి.2017లో ఇజ్రాయెల్ ను సందర్శించిన మొదటి భారత ప్రధాని మోడీ కావడం మళ్ళీ ఇప్పుడు ఆయన సారధ్యం లోనే ఈ విశేష పర్యటన జరగడం ముచ్చటైన పరిణామాలు. ఇజ్రాయెల్ లో భారత ప్రధానికి బ్రహ్మరథం పట్టడం గొప్ప విషయం. రెండు దేశాల మధ్య సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తీసుకు వెళ్లాలని ప్రధాని మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నిర్ణయించడం హర్షించదగినది.విద్య వ్యవసాయ, సైన్స్ సాంకేతికనైపుణ్యాది రంగాలలో పురోగామి ఒప్పందాలను కుదుర్చుకోవడం ముదావహం. ఆలస్యంగా అవత రించినా అమెరికా పాశ్చాత్య దేశాల అండదండలతో అతి శీఘ్రంగా అభివృద్ధి చెందిన ఇజ్రాయెల్ తో సంబంధాలు మత ప్రాతిపదికగా కాకుండా మానవాభ్యుదయం లక్ష్యంగా పెంపొందుతుందని ఆశిద్దాం.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# నాణ్యతపైనే దేశ తయారీ రంగ భవిష్యత్తు

భారత దేశ తయారీ రంగం భవిష్యత్తు, అది పాటించే నాణ్యతా ప్రమాణాలపై ఆధారపడి ఉంటుందని , కనుక తయారీ రంగం అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, తొలి జాతీయ నాణ్యతా సదస్సులో పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి మన దేశం 30 నుంచి 35 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని సంకల్పం చెప్పుకున్న తరుణంలో అన్ని రంగాలలో అత్యున్నత ప్రమాణాలు తప్పనిసరి. జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్ అన్నది తమ ప్రభుత్వ నినాదమనీ వారు చెప్పారు. ఇందుకు అనుగుణంగా దేశ తయారీ రంగాన్ని తీర్చిదిద్దాలి. ఈ నేపథ్యంలో భారత తయారీ రంగ ప్రాధాన్యతను గమనించడం అవసరం. 2026 ఆర్థిక సంవత్సరంలో తయారీ రంగం సుమారు 1 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. 2030 నాటికి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఏటా 500 బిలియన్ డాలర్లను అదనంగా భారత తయారీ మార్కెట్ సమకూర్చనుంది. అంటే అంతర్జాతీయంగా భారత్ తయారీ రంగ హబ్ గా ఎదుగుతోందన్నది గణాంకాలు సూచిస్తు న్నాయి. 2030 నాటికి మన దేశ మధ్యతరగతి అంతర్జాతీ యంగా, సరకు వినియోగ మార్కెట్ లో రెండో స్థానంలో ఉండబోతున్నదని కూడా గణాంకాలు సూచిస్తున్నాయి.

**నాణ్యతే పెద్ద సమస్య :** ఇవాళ మార్కెట్లో అతి పెద్ద సమస్య నాణ్యత. వినియోగదారు పెట్టిన డబ్బుకు నాణ్యమైన సరుకు దొరుకుతుందన్న గ్యారంటీ లేని పరిస్థితి. ఆహార ఉత్పత్తుల నుంచి రకరకాల వస్తువులు , ఉత్పత్తుల వరకు ఏ రంగంలో చూసినా వినియోగదారుకు నాణ్యమైన సరకు దొరకడం పెద్ద సవాలుగా పరిణమించింది. ఆహార పదార్థాల విషయంలో రకరకాల కల్తీలు వినియోగదారులను భయపెడుతుంటే, వస్తువుల విషయంలో నాణ్యతా లోపాలు చికాకు కలిగిస్తున్నాయి. దీనివల్ల అంతిమంగా వినియోగదారులు నష్టపోతున్నారు. వినియోగదారుల రక్షణకు చట్టాలున్నా, వీటిపై జనంలో అవగాహన అంతంతమాత్రమే. కొన్ని దేశాల నుంచి చవకగా లభించే వస్తువులు మార్కెట్ను ముంచెత్తుతున్నాయి. ఇది అటు వినియోగదారులను, నాణ్యతాప్రమాణాలతో సరుకు ఉత్పత్తి చేసే వారినీ దెబ్బతీస్తోంది..

**లక్ష కోట్లకు పైగా నష్టం! :** అథెంటికేషన్ సొల్యూషన్స్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (ఎఎస్పిఎ) , ఫిక్కి సిఎస్సిఎడిఇ కమిటీ అంచనాల ప్రకారం నకిలీ వస్తువులు, దేశంలోకి అక్రమ మార్గంలో వచ్చిన సరుకు కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు, తయారీ రంగానికి సుమారు లక్ష కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని అంచనా . ఆటోమొబైల్ రంగంలో 30 నుంచి 40 శాతం నకిలీ వస్తువులు మార్కెట్లో చలామణి అవుతుండడం వల్ల వాస్తవ తయారీదారులు నష్టపోవడంతోపాటు, వినియోగదారులూ నష్టపోతున్నారు. నాణ్యత లేని ఆటోమొబైల్ పరికరాలు, నకిలీ ఉపకరణాల వల్ల వాహనాలకు తరచూ రిపేర్లు రావడం, ప్రమాదాలకు గురికావడం జరుగుతుంటుంది. ఇది ఈ ఒక్క రంగానికే పరిమితం కాదు, ఇలా ఏ రంగంలో చూసినా నాణ్యత లేని పరికరాలు, వస్తువులు, ఉ త్పత్తులవల్ల జరిగే అనర్థం అంతా ఇంతా కాదు. నకిలీవస్తువుల వల్ల అంతర్జాతీయంగా 2.6 మిలియన్ల మంది ఉపాధి కోల్పోతున్నట్టు ఒక అంచనా.

**వాతావరణానికీ ముప్పే :** నాసిరకం వస్తువులు, ఉత్పత్తుల వల్ల వినియోగదారులకు ప్రత్యక్షంగా నష్టం కలగడమే కాకుండా, పరోక్షంగా పర్యావరణానికీ ముప్పు కలుగుతుంది. ఇది రకరకాల కాలుష్యాలకు కారణమవుతుంది. నాసిరకం ఉత్పత్తులు చాలావరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్తో తయారవుతుంటాయి. వీటివల్ల సహజవనరులు వృధా కావడమే కాకుండా పర్యావరణానికీ హాని జరుగుతుంది. వీటినుంచి మైక్రో ప్లాస్టిక్లు నదులలో జలవనరులలో కలిసి జీవవైవిధ్యానికి హాని చేస్తుంటాయి. ఇక పంటపొలాలకు వాడే పురుగు మందులు, ఎరువుల విషయంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించనట్టయితే అవి భూసారాన్ని దెబ్బతీయడమే కాక, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.

**పరిశోధనలు ఎక్కడ?**


తయారీ రంగం అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలంటే ఎప్పటికప్పుడు ఈ రంగంలో పరిశోధనలు



ముమ్మరంగా సాగాలి. అయితే మన దేశంలో పరిశోధన అభివృద్ధిపై పెడుతున్న ఖర్చు దేశ జి.డి.పిలో 0.6 నుంచి 0.7 శాతం మాత్రమే. అంతర్జాతీయ ఆవిష్కరణల సూచీలో మన దేశం (గ్లోబల్ ఇన్నొవేషన్ ఇండెక్స్) 38 వ స్థానంలో ఉంది. 2015లో 81 వ స్థానంల ఉండగా 2025కు దీనిని 38 వ స్థానానికి తీసుకురాగలిగినట్టు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.

**ప్రమాణాలు :** వివిధ రంగాలలో నిపుణులైన శ్రామికుల కొరత కూడా నాణ్యతా ప్రమాణాలు లోపించడానికి కొంతవరకు కారణమవుతున్నాయి. మనదేశంలో ప్రధానంగా నాణ్యతా ప్రమాణాలను నియంత్రించే సంస్థ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్). దీనిని బిఐఎస్ 2016 చట్టం కింద ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వస్తువులకు ఐఎస్ఐ మార్క్, ఆభరణాలకు హాల్ మార్క్, కీలక భద్రతకు సంబంధించిన ఉత్పత్తుల విషయంలో క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్లు (క్యుసిఒ) ఉన్నాయి. ప్రజారోగ్య అంశాలకు సంబంధించి నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ ప్రమాణాలు ఉన్నాయి. ఆహార భద్రత ప్రమాణాలకు సంబంధించి ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ , వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి అగ్ మార్క్ వంటివి ఉన్నాయి. ప్రజలు తాము కొనుగోలు చేసే వస్తువులకు సంబంధించి ప్రమాణాలను నిర్దేశించే సంస్థల గురించి తెలుసుకుని , ఆ ప్రమాణాలకు తగినట్టు వస్తువులు ఉంటున్నాయా లేదా అన్నది చూసుకోవాలి. 140 కోట్ల మందికి పైగా జనాభా గల దేశంలో, నానాటికీ విస్తరిస్తున్న మార్కెట్ లో , నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణకూ తగినంత యంత్రాంగం అవసరం.

**చవక వస్తువులపై ఆసక్తి :** మరోవైపు మార్కెట్ లో నాణ్యత గలిగిన వస్తువులు లభిస్తున్నా, చాలామంది ఆర్థిక పరిస్థితులు, తక్కువ ధరకు లభిస్తున్నాయన్న కారణంతో నాసిరకం వస్తువుల కొనుగోలు చేస్తున్నారని ఈ ధోరణి నాణ్యతా ప్రమాణాలు పాటించే సంస్థల మార్కెట్ను దెబ్బతీస్తున్నదన్న వాదనా ఉంది. చిన్న ,మధ్యతరహా సంస్థలకు పరిశోధన పరంగా అండగా ఉంటూ మార్కెట్ లో నాణ్యమైన వస్తువులు ఉత్పత్తిచేసేలా ఆయా సంస్థలను ప్రోత్సహించాలి. అలాగే తయారీ దగ్గర నుంచి వినియోగ దారుకు చేరేవరకు అన్ని స్థాయిలలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడడం ఇందుకు ఆయా సంస్థలను బాధ్యులుగా చేయడం అవసరం. అప్పుడే వినియోగదారుకు నిజమైన భరోసా. అలాగే పలు దేశాల నుంచి దిగుమతి అవుతున్న నాసిరకం వస్తువులను ఎడా పెడా దిగుమతులకు అనుమతించడం కాకవాటిని నాణ్యతా పరీక్షకు గురిచేయవలసి ఉంది. అప్పుడే దేశీయ తయారీ సంస్థలకు కొంతవరకు రక్షణ ఉంటుంది.



రేపూరు
ఉమామహేశ్వరరావు,
సీనియర్ జర్నలిస్ట్
9573794759

# కుల ఆధిపత్యం మానసిక వ్యాధికి ప్రత్యక్ష రూపం!

కుల ఆధిపత్యం అనేది ఒక సామాజిక, మానసిక వ్యాధి. ఇది ఆధిపత్య వర్గాలలో అహంకారాన్ని, వివక్షను, బాధితులలో మానసిక ఆందోళనను, ఆత్మన్యూనతను కలిగిస్తుంది. ఆత్మహత్యలకు, దళిత విద్యార్థులపై వేధింపులకు, సామాజిక అసమానతలకు దారితీసే సజీవ సాక్ష్యం. కుల ఆధిపత్యం అనే మానసిక వ్యాధి సమాజంలో ద్వేషాన్ని, అనైక్యతను పెంచుతుంది. అగ్రకుల అహంకారం, ఆధిపత్యం అనే మానసిక వ్యాధితో కేవలం వంద రూపాయల కోసం 'అంటరాని జాతి'అనే ముద్రతో ఓ రెండు నెలల పసికందును పొట్టన పెట్టుకున్న విషాద సంఘటన నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో చోటు చేసుకోవడం భారత సమాజపు అంతరాత్మను కుదిపేస్తుంది. మన రాజ్యాంగంలో సగర్వంగా చెప్పుకునే సమానత్వం, స్వేచ్ఛ, సోదర భావం అన్నమాటలు పల్లెల శివారుల్లోకి సైతం పాకకుండా అగ్రకుల ఆధిపత్యమే రాజ్యమేలడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తుంది. దైవదర్శనానికి సకుటుంబ సమేతంగా వచ్చిన ఓ చాకలి(రజక))కుటుంబాన్ని తక్కువ జాతి పేరుతో దుర్భషలాడుతూ, అగ్రకుల అహంకారాన్ని ప్రదర్శిస్తూ దాడికి పాల్పడి, రెండు నెలల పసికందును చూసైన పశ్చాత్తాప పడకుండా కుల ఆధిపత్యంతో రగిలిపోయిన అగ్రకుల 'రెడ్డి' సామాజిక వర్గానికి చెందిన మానసిక వ్యాధిగ్రస్థులు కాలితో పసికందును తన్ని బలిపశువును చేయడం వారి మానసిక వ్యాధికి ప్రత్యక్ష రూపం. ఈ ఘటన ఒక వ్యక్తి క్రూరత్వమే కాదు... ఓ సమాజపు క్రూరత్వానికి నాంది పలుకుతుంది.

ఆధునిక శాస్త్రాలు, ఉపనిషత్తులు, సంస్కృతి, భక్తి సాంప్రదాయాలు నేటి ప్రజానీకానికి ఆధునిక గురువులు. దేశంలోని ఏ దేవుడి ముందు సమానమే అన్నారు. కానీ దేశానికి పట్టుకొమ్మలైన పల్లెలు, ఆయా పల్లెల్లోని కుటుంబాలు, పల్లె ప్రాంత నివాసుల మనసుల్లో మాత్రం 'ఎవరిది ఎక్కువ జాతి... ఎవరిది తక్కువ జాతి'అనే అసమానతలు మాత్రం లేకపోలేదు. ఈ అసమానతలు కేవలం బావోగ్వేదమే కాదు. అది ఒక సామాజిక నిర్మాణం, ఓ ఆర్థిక వ్యవస్థ, ఓ రాజకీయ శక్తినిర్మాణం, ఓ సాంస్కృతిక నియంతృత్వం. ప్రపంచవ్యాప్తంగా 70 శాతం మంది అణచివేతకు, వివక్షకు గురవుతున్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడినా వందల యేళ్ల నుంచి దళితులు, బహుజనులు అంటరాని మంటల్లో కాలుతూ, ఊరి పొలిమేరల్లోనే జీవనం సాగిస్తున్నారు. సమతా మమతలు అంతుచిక్కని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ దళితులు హింసించబడుతూనే వున్నారు. 'యత్ర నార్యస్తు పూజ్యంతే– రమంతే తత్ర దేవతాః' అన్నారు. ఎక్కడ స్త్రీలు పూజింప బడతారో, అక్కడ దేవతలు నివసిస్తారని అర్థం. కానీ నేడు స్త్రీలు అనేక రకాల వివక్షలకు గురవుతున్నారు. ఇది పూర్తిగా అంతం అయితేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆధునిక కాలం నుండి కుల, మత, జాతి, లింగ, ప్రాంత, వివక్షలు కొనసాగుతున్నాయి. ఇటీవల దేశంలో కుల, మత, ప్రాంత వివక్ష తీవ్రత ఎక్కువైంది. రెండు గ్లాసుల విధానం, దళితులకి ఆలయ ప్రవేశం వంటి వివక్ష నేటికీ కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న వాస్తవం. అహ్మదాబాద్కు ఇరవై మైళ్ల దూరంలోని బైల్ల గ్రామంలో మంచినీటి బావికి దళితులు వెళ్లాలంటే.. వారికి కేటాయించిన సమయంలో మాత్రమే వెళ్లాలి. మిగతా సమయంలో వారు నీళ్ళు తెచ్చుకుంటే, అపరాధ రుసుం చెల్లించాలి. అలాగే, ఓ దళిత విద్యార్థి కుండలో నీళ్ల తాగాడని చదువు చెప్పే టీచరే ఆ విద్యార్థిపై చనిపోయేంతగా కొట్టిన సంఘటన రాజస్తాన్లో జరిగింది. ఇలాంటి సంఘటనలు దేశంలో అనేకం కనిపిస్తాయి. దళితులు, గిరిజనుల పట్ల వారి ఆచార వ్యవహారాలు, కట్టు బొట్టు, తిండి, చదువు, ఉద్యోగాల్లో వివక్ష అనేక రూపాల్లో వ్యక్తమౌతూనే వుంది. అలాగే.. ఈ రోజుకీ ఆడపిల్ల అంటే నష్టం అనే భావన కొనసాగుతున్నది. గర్భంలో వున్నది ఆడపిల్ల అని తెలిస్తే.. గర్భవిచ్ఛిన్నం చేయిస్తున్న సంఘటనలు నేటికీ మనం చూస్తున్నాం. మగపిల్లాడు పుడితే పున్నామ నరకం నుంచి తప్పిస్తాడన్న మూఢనమ్మకం ఇంకా ప్రజల్లో వుంది. 'కులం పునాదుల మీద ఒక జాతిని గానీ, నీతిని గానీ నిర్మించలేం' అంటారు అంబేద్కర్. మనదేశంలో వేళ్లూనుకుని వున్న కులం సమాజాభివృద్ధికి ఆటంకంగా మారింది. ప్రపంచంలోనే అత్యధిక మానవ వనరులు ఉన్న మన దేశం ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉండటానికి ప్రధాన కారణం– ఆర్థిక అసమానతలు, దేశంలో 85 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలపై ఆధిపత్య కులాల అణచివేత. అంటరాని కులంలో జన్మించి, ఎన్నో అణచివేతలు, అసమానతలను అధిగమిస్తూ...వెలివేసిన జీవితాల్లో 'విద్య'తోనే వెలుగులు వికసిస్తాయని నమ్మి, కఠోర పరిస్థితులను అధిగమించి ఉన్నత విద్యలను అభ్యసించిన ప్రపంచ మేధావి, విశ్వవిజ్ఞాని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు 'సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం శూన్యం' అన్నట్లు మనకు రాజకీయ ప్రజాస్వామ్యం ఉంది కానీ, సామాజిక ప్రజా స్వామ్యం లేదు. గ్రామాల్లో నేటికీ దేవాలయాల ప్రవేశం భోజనాల ఏర్పాటు కుల ఆధారంగా అవమానం కొనసాగుతున్నంత కాలం మనది ఆధునిక సమాజం అని చెప్పుకోవడం ఓ నాటకం కులహింసను చట్టంతో మాత్రమే నిర్మూలించలేం చట్టం కేవలం శిక్షిస్తుంది కానీ చైతన్యం రాదు. విద్య, మీడియా, సాహిత్యం, రాజకీయాలు, మతం అన్ని కలిసి ఒక సమ సామాజిక రాజకీయ విప్లవం చేయాలి. గ్రామ స్థాయిలో కుటుంబ వ్యక్తిగత స్థాయిలో కుల భావజాలాన్ని ప్రశ్నించాలి. ప్రస్తుతం దేశాన్ని, రాష్ట్రాన్ని కుదిపేస్తున్న కుమ్మెర ఘటన ఒక ముగింపు కాదు. ఇది ఒక ఆరంభం. మన మనసుల్లో సమ సామాజిక ఉద్యమాన్ని ప్రారంభించాల్సిన ఆరంభంగా ఈ ఘటన పరిగణించి, అగ్ర కుల అహంకారానికి బలైతున్న దళితులు, బహుజనులు అందరూ ఏకతాటిపై వచ్చి, కులహింసను నిర్మూలించే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఈదునూరి మహేష్
9949134467

# విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని సరిదిద్దే ప్రయత్నం

ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణే మార్గమా? అనే ప్రశ్న ఈ మధ్యకాలంలో రాష్ట్ర విద్యా వ్యవస్థలో కేంద్రబిందువుగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే అంశం కేవలం పరిపాలనా నిర్ణయంగా కాకుండా, ప్రభుత్వ విద్యా భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక విధానంగా చర్చకు వచ్చింది. విద్యార్థుల నమోదు తగ్గుదల, ఉపాధ్యాయుల అసమతుల పంపిణీ, ప్రభుత్వ వ్యయం సమర్థ వినియోగం వంటి అంశాలు ఈ నిర్ణయానికి నేపథ్యంగా నిలిచాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఈ ప్రక్రియను పూర్తిగా అమలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం, దీనిపై జరుగుతున్న రాజకీయ–సామాజిక చర్చలకు మరింత బలం చేకూర్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను వెనక్కి తిరిగి పరిశీలిస్తే, ఉపాధ్యాయ నియామకాలు, బదిలీలు, పదోన్నతులు తరచుగా ప్రాంతీయ, రాజకీయ ఒత్తిళ్లకు లోనైన సందర్భాలు అనేకం. ఒక దశలో విద్యార్థుల సంఖ్యకు మించిన ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలల్లో కేంద్రీకృతమవగా, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లో కనీస అవసరానికి సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ గతంలో నిర్వహించిన అంతర్గత సర్వేలు ఈ అసమానతలను స్పష్టంగా చూపించాయి. కొన్ని పట్టణ పాఠశాలల్లో ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తి 1:15 లేదా 1:18గా ఉండగా, అదే సమయంలో గిరిజన మండలాల్లో ఈ నిష్పత్తి 1:55 నుంచి 1:65 వరకు పెరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ పరిస్థితి విద్యా నాణ్యతపై మాత్రమే కాకుండా, సమాన అవకాశాల సూత్రంపైనా తీవ్ర ప్రభావం చూపింది. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సుమారు లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు నాలుగు లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే విద్యార్థుల నమోదు సంఖ్య గత పది సంవత్సరాల్లో గణనీయంగా తగ్గింది. 2013–14లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య సుమారు 60 లక్షలుగా ఉంటే, 2023–24 నాటికి అది 40 లక్షల లోపుకు తగ్గినట్లు విద్యాశాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల విస్తరణ, పట్టణాలకు వలసలు, జనాభా ధోరణుల మార్పు, ఆంగ్లమాధ్యమంపై పెరుగుతున్న ఆసక్తి వంటి కారణాలు ఈ తగ్గుదలకు దోహదపడ్డాయి. విద్యార్థుల సంఖ్య తగ్గినా, ఉపాధ్యాయుల సంఖ్య అదే స్థాయిలో కొనసాగడం వల్ల అసమతులత మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లోనే ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే భావన విధాన పరంగా ముందుకు వచ్చింది. హేతుబద్ధీకరణ అంటే ఉద్యోగాలను తొలగించడం కాదు, ఉన్న వనరులను అవసరమైన చోట అవసరమైనంతగా పంపిణీ చేయడం. విద్యార్థుల సంఖ్య, తరగతుల సంఖ్య, పాఠశాల స్థాయి, భౌగోళిక పరిస్థితులు వంటి ప్రమాణాల ఆధారంగా ప్రతి పాఠశాలకు ఎంతమంది ఉపాధ్యాయులు అవసరమో నిర్ణయించడం ఈ ప్రక్రియ యొక్క మూల ఉద్దేశం. ప్రభుత్వ నివేదికల ప్రకారం ప్రస్తుతం సుమారు 20 శాతం పాఠశాలల్లో అవసరానికి మించిన ఉపాధ్యాయులు ఉండగా, దాదాపు 30 శాతం పాఠశాలల్లో తీవ్ర కొరత ఉంది. ఒక పాఠశాలలో 30 నుంచి 40 మంది విద్యార్థులకు ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయులు ఉండగా, మరో పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండటం వంటి ఉదాహరణలు ఈ అసమతులతను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. జాతీయ విద్యా విధానం సూచనలు కూడా ఈ నిర్ణయానికి బలమైన ఆధారంగా నిలిచాయి. ప్రాథమిక స్థాయిలో 1:30, ప్రాథమికోన్నత స్థాయిలో 1:35 ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తి ఉండాలన్న మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా సూచించింది. ఈ ప్రమాణాలను అమలు చేయాలంటే కొత్త నియామకాలు చేపట్టడం కన్నా ముందుగా ఉన్న ఉపాధ్యాయులనుసమర్థంగా వినియోగించడమే ఆచరణాత్మక మార్గమని రాష్ట్ర విద్యా శాఖ భావించింది.



ఆర్థిక శాఖ అంచనాల ప్రకారం, హేతుబద్ధీకరణ పూర్తయితే ప్రతి సంవత్సరం వందల కోట్ల రూపాయల ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగంలోకి వస్తుంది.

అవసరానికి మించిన ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో వేతనాలపై ఖర్చయ్యే అదనపు వ్యయం తగ్గి, కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా నాణ్యత మెరుగుపడే అవకాశం ఏర్పడుతుంది. ఈ నిర్ణయంపై ఉపా ధ్యాయ సంఘాల స్పందన మిశ్రమంగా ఉంది. కొన్ని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాలు హేతుబద్ధీకరణ అవసరాన్ని సూత్రప్రాయంగా అంగీకరిస్తూనే, అమలు విధానంపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగ భద్రతకు భంగం కలగకూడదని, బలవంతపు బదిలీలు కుటుంబ జీవనాన్ని అస్తవ్యస్తం చేయకూడదని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు, దూర ప్రాంతాలకు బదిలీ అయితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని సంఘాలు పేర్కొంటున్నాయి. మరోవైపు కొన్ని సంఘాలు మాత్రం సరైన డేటా ఆధారంగా, పారదర్శకంగా అమలు చేస్తే హేతుబద్ధీకరణ వల్ల ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని అభిప్రాయ పడుతున్నాయి.

ప్రభుత్వం ఈ విమర్శలకు ప్రతిస్పందిస్తూ, హేతుబద్ధీకరణ వల్ల ఒక్క ఉపాధ్యాయుడి ఉద్యోగం కూడా పోదని, వేతనాలు తగ్గవని స్పష్టం చేసింది. బదిలీల్లో పారదర్శకత కోసం ఆన్లైన్ విధానం, పాయింట్ల వ్యవస్థ అమలు చేస్తామని, సీనియారిటీ, సామాజిక పరిస్థితులు, వైద్య కారణాలకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చింది. వేసవి సెలవుల కాలాన్ని వినియోగించి ఈ ప్రక్రియను పూర్తిచేయడం ద్వారా విద్యా సంవత్సరం మధ్యలో బోధనకు అంతరాయం కలగకుండా చూడాలన్నది ప్రభుత్వ వ్యూహం. జిల్లాల వారీగా డేటా సేకరణ, మండల స్థాయి సమీ క్షలు, రాష్ట్ర స్థాయి ఆమోదం వంటి దశలను ఇప్పటికే ఖరారు చేసింది.

సామాజిక కోణంలో చూస్తే ఈ నిర్ణయం ఎంతో కీలకం. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలపై ఆధార పడుతున్నారు. అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉండటం అంటే నేరుగా ఆ వర్గాల భవిష్యత్తును దెబ్బతీయడమే. హేతుబద్ధీకరణ ద్వారా ఈ ప్రాంతాలకు తగినంత ఉపాధ్యాయులు అందుబాటులోకి వస్తే విద్యలో సమాన అవకాశాలు పెరుగుతాయి. ఇది రాజ్యాంగంలోని సమానత్వం, సామాజిక న్యాయం అనే సూత్రాలకు అనుగుణమైన చర్యగా భావించవచ్చు. అయితే ఈ ప్రక్రియలో సవాళ్లు కూడా తక్కువ కావు. తక్కువ విద్యార్థులున్న పాఠశాలల విలీనాలు, గ్రామ స్థాయిలో భావోద్వేగాలు, రాజకీయ ఒత్తిళ్లు ఈ సంస్కరణకు అడ్డంకులు కావచ్చు. కొన్ని గ్రామాల్లో పాఠశాల ఒక గుర్తింపుగా ఉండటం వల్ల మార్పులకు వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది. అందువల్ల ప్రభుత్వం కేవలం పరిపాలనా ఆదేశాలతో కాకుండా, తల్లిదండ్రుల సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి, విశ్వాసాన్ని గెలుచుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఒక కీలక విధాన మార్పు. ఇది సమర్థంగా, పారదర్శకంగా, మానవీయంగా అమలైతే ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి దారి తీసే అవకాశం ఉంది. విద్యా నాణ్యత మెరుగు పడటం, ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తి సమతుల్యం కావడం, ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగం కావడం వంటి లక్ష్యాలు సాధ్యమవుతాయి. అయితే ఈ ప్రయత్నం విజయం సాధిస్తుందా లేదా అన్నది పూర్తిగా అమలు విధానంపైనే ఆధారపడి ఉంటుంది. హేతుబద్ధీకరణ ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తును నిజంగా మారుస్తుందా అన్న ప్రశ్నకు సమాధానం రానున్న విద్యా సంవత్సరంలోనే స్పష్టమవుతుంది.

> కొన్ని గ్రామాల్లో పాఠశాల ఒక గుర్తింపుగా ఉండటం వల్ల మార్పులకు వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది. అందువల్ల ప్రభుత్వం కేవలం పరిపాలనా ఆదేశాలతో కాకుండా, తల్లిదండ్రుల సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి, విశ్వాసాన్ని గెలుచుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఒక కీలక విధాన మార్పు. ఇది సమర్థంగా, పారదర్శకంగా, మానవీయంగా అమలైతే ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి దారి తీసే అవకాశం ఉంది. విద్యా నాణ్యత మెరుగు పడటం, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి సమతుల్యం కావడం, ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగం కావడం వంటి లక్ష్యాలు సాధ్యమవుతాయి. అయితే ఈ ప్రయత్నం విజయం సాధిస్తుందా లేదా అన్నది పూర్తిగా అమలు విధానంపైనే ఆధారపడి ఉంటుంది.



సంగనబట్ల
9440595494



# గ్రేటర్ హైదరాబాద్



## అందుబాటులో సంతాన సాఫల్య కేంద్రం

### మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



**షాద్‌నగర్, ఫిబ్రవరి 26 (వుదయం) :** షాద్‌నగర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ శారద ఫెర్టిలిటీ అండ్ ఐవిఫ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి విశాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, షాద్‌నగర్ లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఫెర్టిలిటీ అండ్ ఐవిఫ్ సెంటర్ ఏర్పాటు కావడం సంతాన సాఫల్యం కోసం పెద్ద పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఆనందకరమని పేర్కొన్నారు. ఇటువంటి వైద్య సంస్థలు మరింతగా అభివృద్ధి చెందాలని ఆశిస్తూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం పాల్గొన్నారు.

## కౌన్సిలర్‌కి శుభాకాంక్షలు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 26 (వుదయం):** జహీరాబాద్ మున్సిపల్ 32 వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన శ్రీ మజ్జిగ సుజిత విశ్వేశ్వర్ ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం. ఈ సందర్భంగా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సిములు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు రావాలని బసవేశ్వరుడు సూచించిన మార్గంలో నడవాలని కొనియాడారు, ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పోలీస్ సంతోష్ పాటిల్, జిల్లా సలహాదారులు అన్నిశెట్టి జయప్రకాశ్, జహీరాబాద్ తాలూకా అధ్యక్షులు అగుర్ శివరాజ్, యువజన అధ్యక్ష కార్యదర్శులు బుగ్గనగారి మల్లికార్జున్, నవీన్ రామోజీ, మజ్జిగ సోదరులను ఘనంగా సన్మానించారు.

# ఇష్టపడి చదవండి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులచే ప్రత్యేక తరగతులు ప్రారంభం
- 8 వేల మంది విద్యార్థులకు సొంత నిధులచే ప్రత్యేక మోటివేషన్ క్లాసులు.. పరీక్షా సామాగ్రి పంపిణీ..



**పటాన్చెరు, ఫిబ్రవరి 26 (వుదయం) :** ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇష్టపడి చదివి.. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు సూచించారు.

గురువారం పటాన్చెరు పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్లో.. పటాన్చెరు, జెపి కాలనీ డివిజన్లతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీ, ఇంద్రేశం మున్సిపాలిటీ, పటాన్చెరు మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న 3000 వేల మంది విద్యార్థినీ విద్యార్థులకు తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతులను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన పదవ తరగతి పరీక్ష సమయంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి అన్న అంశంపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు చంద్రయ్యచే ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇంట్లో ఫోన్లు, టీవీలకు పిల్లలను దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సొంత నిధులచే కొనుగోలు చేసిన పరీక్ష మెటీరియల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వర రావు నాయక్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల హెడ్ మాస్టర్లు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బాలసదనం, జైలు సందర్శన

### పిల్లల సంక్షేమం, ఖైదీల సమస్యలపై ఆరా




**సిద్దిపేట, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ మరియు సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి ఆదేశాల మేరకు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ మరియు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీ ఎన్.సంతోష్‌కుమార్ గురువారం సిద్దిపేటలోని బాలసదనం మరియు జిల్లా జైలును సందర్శించారు. బాలసదనాన్ని సందర్శించిన జడ్జి సంతోష్ కుమార్, అక్కడి పిల్లలతో ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువు విలువను గుర్తించాలని, చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. అనంతరం వసతి గృహంలోని గదులు, వంటగది పరిసరాలు, ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ ద్వారా సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. అనంతరం జిల్లా జైలును సందర్శించిన జడ్జికి జైలు సూపర్ ఇంటెండెంట్ మరియు సిబ్బంది స్వాగతం పలికారు. జైలులోని వంటగది, స్టోర్ రూమ్ మరియు టాయిలెట్లను ఆయన పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న భోజన వసతులపై అధికారులను ఆరా తీశారు. ఖైదీలు సద్వర్తనతో ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి ఖైదీకి అడ్వకేట్ ఉండాలని, అడ్వకేట్ లేని వారికి 'లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్' ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ప్రతినిధులు నెలకు మూడు సార్లు జైలును సందర్శిస్తారని వెల్లడించారు.ఈకార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీ శ్రీకర్ రెడ్డి, బాలసదనం సిబ్బంది, జిల్లా జైలు సిబ్బంది మరియు న్యాయసేవ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేత

**సంగారెడ్డి, ఫిబ్రవరి 26 (వుదయం):** మిషన్ భగీరథ పరిధిలోసింగూరు ఆనకట్ట వద్ద ఉన్న బూసరెడ్డిపల్లి 100 ఎంఎల్డీ నీటి శుద్ధి కర్మాగారంలో ఫిల్టర్ బెడ్ మరమ్మత్తు పనులు చేపడుతున్న కారణంగా 2702 2026 (శుక్రవారం) మరియు 28 022026 (శనివారం) తేదీలలో నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నేపథ్యంలో మునిపల్లి, కోహీర్, ఝరాసంఘం , జహీరాబాద్, మొగుడంపల్లి, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్, అమీన్పూర్, పటాన్‌చెరు మున్సిపాలిటీలు మరియు మండలాల పరిధిలో నీటి సరఫరా నిలిచి పోతుందని ఆమె తెలిపారు.

మరమ్మత్తు పనులు పూర్తైన వెంటనే సాధారణ నీటి సరఫరా పునరుద్ధరించ బడుతుందని పేర్కొన్నారు. ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.


## విద్యతో పాటు సంస్కారం నేర్పించడమే తమ లక్ష్యం

**జహీరాబాద్, ఫిబ్రవరి 26 (వుదయం):** నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ పాఠశాల కొనసాగుతుందని స్థానిక శ్రీ మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ మరెల్లి వెంకటయ్య వ్యాఖ్యనించారు. పాఠశాలలో గురువారం నాడు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈరోటు చేసిన సమావేశంలో ఆయన




పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత మైన లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ క్రమంలోనే విద్యార్థులు ముందడుగు వేయాలని సూచించారు. చదువు జ్ఞానాన్ని నేర్పిస్తే సంస్కారం ఆదర్శమైన జీవితానికి నడక నేర్పిస్తుందని ఉద్బోధించారు. ఈ స్వయంపాలన దినోత్సవంలో జిల్లా విద్యాశాఖాధికారిగా ఎం. వైష్ణవి, మండల విద్యాధికారిగా డి.పూజ, ప్రిన్సిపాల్ గా ఎస్.తుల్జారాం, మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులను నిర్వర్తించారు. అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మాణిక్యమ్మ,నాగలక్ష్మి, శివశంకర్, నర్సింలు, అరుణ, స్వరూప, మందాకిని, అనిత, సువర్ణ, సోని, లక్ష్మి, రాజేశ్వరి లు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగిన ఈ స్వయం పాలన దినోత్సవంలో పోషకులు సైతం తమ చిన్నారులను హోదాకు తగ్గట్టుగా వేషధారణ చేసి పంపడం ఆహుతులను ఆకట్టుకొంది.

## ఉపాధ్యాయుడికి వీడ్కోలు



**జహీరాబాద్, ఫిబ్రవరి 26 (వుదయం):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండల కేంద్రం గురుజువాడ గ్రామంలో దీర్ఘకాలం విద్యా సేవలందించిన పదవీ విరమణ ఉపాధ్యాయునికి ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి. జీన్ రాజ్, గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ పాల్గొని,ఉపాధ్యాయుడు బి. జీన్ రాజ్, కు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గురుజువాడ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ . ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి పునాది వంటిదని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అమోఘమని అన్నారు. గ్రామ అభివృద్ధి, విద్యా విస్తరణలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, యువకులు పాల్గొని పదవీ విరమణ చేసిన గురువుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 26 (వుదయం):** జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్ల పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు. మొత్తం 15,515 మంది విద్యార్థులకు గాను 15,209 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 14,296 మంది, వృత్తి (వొకేషనల్) కోర్సుకు చెందిన 913 మంది విద్యార్థులు హాజరైనారని తెలిపారు. మొత్తం 306 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, అందులో జనరల్ కోర్సుకు చెందిన 259 మంది, వృత్తి కోర్సుకు చెందిన 47 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం హాజరు శాతం 98.03% నమోదైందనీ, ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయన తెలిపారు.పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు కన్వీనర్/డీఐఈఓ 2 పరీక్ష కేంద్రాలను, డీఈసీ సభ్యులు 11 కేంద్రాలను, హెచ్‌పీసీ సభ్యులు 5 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్లు 14 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేసినట్లు గోవింద్ రామ్ తెలిపారు.

## సిద్ధిపేట మున్సిపల్ బడ్జెట్ రూ. 181.99 కోట్లు

### కలెక్టర్ కె. హైమావతి సమక్షంలో ఏకగ్రీవ ఆమోదం

**సిద్దిపేట, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి) :** సిద్ధిపేట పురపాలక సంఘం 2026 27 ఆర్థిక సంవత్సరానికి గాను భారీ బడ్జెట్‌ను ఖరారు చేసింది. గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ. 181.99 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆధ్వర్యంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట్రావ్ బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు.మొత్తం ఆదాయం: రూ. 181,99,50,000 (181.99 కోట్లు), మొత్తం వ్యయం: రూ. 181,93,40,000 (181.93 కోట్లు), మిగులు బడ్జెట్: రూ. 6.10 లక్షలు. సాధారణ వ్యయం కింద కేటాయించిన రూ. 52.93 కోట్లలో,



మూడవ వంతు నిధులను (రూ. 2.73 కోట్లు) పట్టణంలోని వెనుకబడిన మురికివాడలు, మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేటాయించడం విశేషం. రహదారులు, డ్రైనేజీలు మరియు తాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ఈ నిధులను వినియోగించనున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 10 శాతం నిధులను 'హరిత బడ్జెట్' కు కేటాయించారు. ఇందుకోసం రూ. 5.29 కోట్లను ప్రత్యేకంగా కేటాయించి, పట్టణాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపాలిటీ ఆదాయవ్యయాల మధ్య సమతుల్యత పాటిస్తూ సమగ్రమైన బడ్జెట్‌ను రూపొందించిందని ప్రశంసించారు. పట్టణ అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలను తుది ఆమోదం కోసం ప్రభుత్వానికిపంపనున్నట్లు ఆమె తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ ఇంట్లో చోరీ..

### 6 తులాల బంగారం మాయం!

**చండూరు, ఫిబ్రవరి 26 (వుదయం):** నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో దేప వెంకట్ రెడ్డి (45) అనే ఆటో డ్రైవర్ ఇంట్లో గురువారం చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదు అపహరించారు. వెంకట్ రెడ్డి కస్తాల గ్రామంలో బంధువుల పెళ్లికి మధ్యాహ్న సమయంలో భార్యతో కలిసి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగిలి ఉండడం, బీరువాలో బట్టలు చిందరవందరగా ఉండడం గమనించారు. నగదు, బంగారం కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివకుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



**సిద్దిపేట, ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి):** కష్టాల్లో ఉన్న పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ స్పష్టం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామానికి చెందిన మక్కన లక్ష్మి (భర్త: పగడయ్య) కుటుంబానికి ఆయన భరోసా కల్పించారు.మక్కన లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పూజల హరికృష్ణ తక్షణమే స్పందించారు. ప్రభుత్వంతో మాట్లాడి ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2,50,000 (రెండు లక్షల యాభై వేల రూపాయలు) విలువైన ఎల్‌ఓసీ ని మంజూరు చేయించారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఈ ఎల్‌ఓసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ వైద్యానికి దూరం కాకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెల్కటూరు గ్రామ సర్పంచ్ నరేష్, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు నాయిని నర్సింహా రెడ్డి, మేరుగు రాజు, మాజీ ఉప సర్పంచ్ బత్తిని వెంకటేశం, వార్డు మెంబర్ మల్లమ్మరి శంకర్, గోల్లేనా నరేష్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళాశాల నిర్మాణానికి సహకరించండి

### తోషిబా యాజమాన్యాన్ని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, ఫిబ్రవరి 26 (వుదయం) :** పటాన్చెరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు సిఎస్ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తోషిబా యాజమాన్యాన్ని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం లో గల తోషిబా పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులకు పరిశ్రమ యాజమాన్యం సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.


ప్రధానంగా ఇటీవల పటాన్చెరు నియోజకవర్గానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడం జరిగిందని.. శాశ్వత ప్రతిపాదికన అమీన్పూర్ పరిధిలోని సర్వేనెంబర్ 993లో కళాశాల భవనం, హాస్టల్ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. నిధుల కొరత మూలంగా భవన నిర్మాణ పనులు ముందుకు కొనసాగడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కళాశాల మరియు హాస్టల్ భవన నిర్మాణాల కోసం 45 కోట్ల 70 లక్షల రూపాయలతో ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు అంచనాల రూపొందించడం జరిగిందని వారి దృష్టికి తీసుకెళ్లారు.

రాబోయే రోజుల్లో నియోజకవర్గ పరిధిలోని పారిశ్రామిక రంగానికి అత్యంత ఆవశ్యకమైన ఇంజనీర్లను తయారు చేయడంలో పాలిటెక్నిక్ కళాశాల కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణ కోసం పరిశ్రమ సిఎస్ఆర్ నిధులు కేటాయించి.. అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పరిశ్రమ యాజమాన్యాకి విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లో పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో కీలకమైన వాహనాల కొనుగోళ్లకు సైతం సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులు అతి త్వరలో యాజమాన్యంతో చర్చించి సిఎస్ఆర్ నిధులు కేటాయించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమ సిఎండి హిరోషి పురుట, డైరెక్టర్ మానవ వనరుల విభాగం కట్టుతోషి మారుమోతో, హెచ్ ఆర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో ప్రమాణ కోసం సర్వం సిద్ధం





**పటాన్చెరు, ఫిబ్రవరి 26 (వుదయం) :** ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వార్షిక ఉత్సవం 'ప్రమాణ 2026'ను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించనుంది. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ మార్గదర్శనంలో స్టూడెంట్ ఆర్గనైజింగ్, లీడర్ షిప్ కమిటీ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంది.

ముందస్తు వేడుకలతో ఈ యేడాది ప్రమాణ ఆరంభమైంది. ఇందులో నృత్య, పాటల పోటీలు, ఆటో ఎక్స్‌పో, ముఖాముఖి చర్చలను ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్లు అన్నింటిలో హైదరాబాద్ ప్రాంగణ అధికార మస్కట్ రోరోను ప్రదర్శిస్తున్నారు. ఇక తొలిరోజు ప్రమాణ 2026 ఆటో ఎక్స్ పోతో శుభారంభం కానుంది. ది డెక్కన్ ప్రాజెక్ట్, ది హెడ్ లైనర్ బ్యాండ్, ప్రముఖ నేపథ్య గాయని గీతా మాధురి ప్రదర్శనతో పాటు DJ NANDZY యొక్క హై ఎనర్జీ డీజే సెట్ వంటివి అలరించనున్నాయి. చివరి రోజు, ఈనెల 28న, కశ్యప్ ప్రదర్శనలు, డీజే స్వాట్రెక్స్ యొక్క అద్భుతమైన ఈడీఎం ప్రదర్శనను ప్రేక్షకులు వీక్షిస్తారు. వాటికి నృత్యం, సంగీతం, నాటకం, సాంస్కృతిక యుద్ధాలు వంటి ఉన్నత స్థాయి పోటీలు జతకలుస్తాయి. వీటికి అదనంగా, 'మూడు రోజులు - మూడు అనుభూతులు' పేరిట మోటార్ స్పోర్ట్స్, గ్లామ్ అండ్ గాలా, ప్రధాన పాత్ర వంటి ఇతివృత్తాలతో నిర్వహిస్తున్నారు. 'ప్రమాణ ఉత్సవం కంటే ఎక్కువ. ఇది ఆచరణతో కూడిన అనుభవపూర్వక అభ్యాసం. ప్రణాళిక, బడ్జెట్, అమలు, సమన్వయం, సమయ నిర్వహణ వంటి విద్యార్థుల భవిష్యత్తు కెరీర్ కు అవసరమైన అన్ని ప్రధాన జీవన నైపుణ్యాలను ఆచరణాత్మకంగా నేర్చుకుంటారు. మరీ ముఖ్యంగా, ఆనందాన్ని ఆస్వాదిస్తూ నేర్చుకోవడం ఈ వేడుక ప్రత్యేకత. బాధ్యత, వేడుకల సమతుల్యత ప్రమాణకు నిజమైన నిర్వచనం' అని ప్రమాణ విస్తృత ప్రభావాన్ని క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ వివరించారు. మొత్తంమీద, ప్రతిభ, నాయకత్వం, అభ్యాసం వంటివి తరగతి గదికి మించి నేర్చుకునే శక్తివంతమైన వేదికగా ప్రమాణ 2026 నిలుస్తుంది.

Classified Ads English / Telugu
వుదయం తెలుగు దిన పత్రిక ద్వారా
@ Rs. 300/-
Pay for 3 Get Free 2 Classifieds
- బహిరంగ ప్రకటనలు
- లీగల్ నోటీసులు
- ఉద్యోగ
- వ్యాపార
5 3 ప్రకటనలకు చెల్లించండి
2 ప్రకటనలు ఉచితంగా పొందండి
ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించడండి 9553256199 7013538549
Change of Name | Lost of Documents | Legal Notices
Wanted Employees | Real Estate | Public Notices
Advertise Classifieds Rs. 300/-
వుదయం | Powered by ProjectWe4 Technologies

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి




జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.
జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 26 (వుదయం జిల్లా ప్రతినిధి):

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు.వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం,

మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వంట సిబ్బంది పరిశుభ్రతను పాటించడంతో పాటు, ఆహార పదార్థాలు తాజావిగా ఉండేలా చూడాలని, గడువు ముగిసిన పదార్థాలను వినియోగించొద్దని ఆదేశించారు. భోజనం బావుంది ప్రతి రోజు ఇలానే చేయాలని వంట సిబ్బందిని అభినందించారు..పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తరచుగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు మంచి అలవాట్లు అలవరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, భద్రతా పరమైన చర్యలపై దృష్టి సారించాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రహరీ గోడ పైభాగంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ జీవరత్నం,

పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- లక్ష్యసాధన దిశగా... విద్యార్థుల ప్రస్థానం!
- క్రమశిక్షణతో కూడిన చదువే ఉన్నత శిఖరాలకు తొలిమెట్టు.
- నేటి విద్యార్థులే రేపటి విజేతలు: ఉన్నత స్థాయికి చేరే మార్గాలు.
- కష్టపడి చదువుదాం... గౌరవప్రదమైన స్థానాన్ని అందుకుందాం!

# భూ కబ్జాలపై బీజేపీ గర్జన

## దాతల భూములను వదలని వైనంపై మండిపాటు

ఖమ్మం , ఫిబ్రవరి 26 (వుదయం జిల్లా ప్రతినిధి):



రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాలో పేదల పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరిస్తోందని, బడా బాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసమే దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను కనికరం లేకుండా నేలమట్టం చేస్తోందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. గురువారం ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వర రావు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రులు, రెవెన్యూ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. దాతలు పేదల కోసం ఇచ్చిన భూములను కాజేయాలని చూస్తున్న అధికార పక్ష నేతల కుట్రలను వారు తీవ్రంగా ఎండగట్టారు.దశాబ్దాల క్రితం దాతలు పేదల నివాసాల కోసం దానంగా ఇచ్చిన భూముల్లో చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవిస్తున్న అమాయక ప్రజలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు వెళ్లి పంచనామాలు చేసి, వారి నుంచి ఆధార్ కార్డులు లాక్కొని, కనీసం 24 గంటల సమయం కూడా ఇవ్వకుండానే రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయడం ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. పసిపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, మహిళలు అనక రోడ్డున పడి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నా అధికారుల్లో కనీస మానవత్వం లోపించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తమ కమీషన్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసమే ఈ దారుణాలకు ఒడిగడుతున్నారని ఆరోపించారు.ఈ భూముల వెనుక ఉన్న చరిత్రను బీజేపీ నాయకులు మీడియాకు పూసగుచ్చినట్లు వివరించారు. 1954వ సంవత్సరంలో భూదాన ఉద్యమ స్ఫూర్తితో కల్వల రాజేశ్వరరావు అనే దాత పేదల నివాసాల కోసం సుమారు 62 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారని గుర్తుచేశారు. సర్వే నెంబర్లు 147, 148, 149 తదితర నెంబర్లలో ఉన్న ఈ భూములను అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం నుంచి మొదలుకొని, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల వరకు ఏ ఒక్కరూ పేదలకు పంచాలనే కనీస ఆలోచన చేయలేదని విమర్శించారు. దాతల ఆశయాలకు గండికొడుతూ, ఇప్పుడు ఆ భూములను ఆక్రమించి, పేదలను గెంటివేసి, బడా బాబుల విలాసాల కోసం ఖమ్మంలో 'జూబ్లీహిల్స్' తరహా కాలనీలను నిర్మించాలని మంత్రులు కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి మంత్రులు మూడు ప్రభుత్వాలు మారినా పదవుల్లో ఉంటూ పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, ఆ లోటును పూడ్చుకునేందుకే ఇలాంటి భూముల అమ్మకాలకు తెరలేపిందని బీజేపీ నేతలు ఆరోపించారు. బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ పన్నెండు నెలల కాలానికి సుమారు రూ. 2,30,000 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, కేవలం రూ. 1,40,000 కోట్లు మాత్రమే ఖజానాకు చేరిందని లెక్కలతో సహా వివరించారు. సుమారు 90 వేల కోట్ల రూపాయల రెవెన్యూ లోటులో ఉన్న ప్రభుత్వం, ఆ ఖాళీని భర్తీ చేసుకునేందుకు దాతలు పేదల కోసం ఇచ్చిన భూములను సైతం అమ్ముకునే నీచమైన స్థాయికి దిగజారిందని మండిపడ్డారు. పక్కా ఇళ్లు కట్టుకుని కోట్లు గడిస్తున్న కబ్జాదారులను వదిలేసి, పేదవాడి పూరిగుడిసెపై ప్రతాపం చూపించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు.కాంగ్రెస్, ఇతర పార్టీలు మైనార్టీలను, పేదలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని వారు విమర్శించారు. ఎన్నికల సమయంలో ముస్లింలు, పేదల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేసే నాయకులు, నేడు అదే ముస్లిం, మైనార్టీ పేదలకు చెందిన ఇళ్లను కనికరం లేకుండా కూల్చివేస్తున్నారని దుయ్యబట్టారు. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన తర్వాత వారిని వీధిన పడేయడం దారుణమన్నారు. పేదల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.చివరగా, ప్రభుత్వానికి, రెవెన్యూ అధికారులకు బీజేపీ నేతలు సవాల్ విసిరారు. దమ్ముంటే, ఏ పాపం ఎరుగని పేదల ఇళ్లు కూల్చడం ఆపి, 1954 నాటి 'పహాణీ' (భూ రికార్డులు) ని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఆ 62 ఎకరాల భూములు ఎవరివి? ఎవరి కోసం ఇచ్చారో రికార్డులు బయటపెడితే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు.

తక్షణమే ఈ కూల్చివేతలు ఆపి, నిరాశ్రయులైన పేదలకు అదే స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ప్రజా ఉద్యమం చేపడతామని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.మీడియా

సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, మందడప సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో బీఎంఎస్ ధర్నా




కరీంనగర్ ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా

భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.కార్మిక చట్టాల అమలులో నిర్లక్ష్యం,కనీస వేతనాల పెంపు లేకపోవడం,కార్మికుల సామాజిక భద్రతా హక్కుల పరిరక్షణలో లోపాలు వంటి అంశాలపై ఈ నిరసన ప్రదర్శన, ధర్నా కార్యక్రమం జరిగింది..ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పసుల శ్రవణ్ ,తొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూబీడీ కార్మికుల హక్కులు కాపాడాలని,బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని,అన్ని రంగాల్లో కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని,ఆశ ,అంగన్వాడీ కార్యకర్తల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాల పెంపు భద్రతా పథకాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులే దేశ ఆర్థిక వ్యవస్థకు మూలం.కానీ ప్రభుత్వాలు పట్టించుకున్న పరిస్థితుల్లో లేవు, ఈపీఎస్ 95 పెన్షనర్లకు రూ 7500 లకు పెంచాలి, ఈ ఎఫ్ పి ఓ కనీస వేతన పరిమితిని పెంచాలని, కరీంనగర్ లో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్. చేశారు,ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు,రైస్ మిల్ కార్మికులు,స్ట్రీట్ వెండర్స్, బి ఎం ఎస్ కార్యకర్తలు,బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రేణికుంట శంకర్,నక్క అరుణ్,ఆకుల తిరుపతి, మధుకర్, రాజేశం,సుమతి,స్వప్న,అనసూర్య,లక్ష్మీ,అనిత తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం...



జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత
జగిత్యాల ఫిబ్రవరి 25 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లాలో మీ సేవ ఆపరేటర్లకు సదరం /యుడిఐడి వెబ్ సైట్లో వికలాంగత్వం ధృవీకరణ కోసం "మీ సేవ" కేంద్రాలలో కొత్తగా నమోదు 21 రకాల కేటాగిరీల గురించి స్లాట్ బుకింగ్ చేసుకునే విధానం (రీ అసెస్మెంట్ టెంపరరీ సర్టిఫికెట్ స్లాట్ బుకింగ్) దివ్యాంగులకు యుడిఐడి సదరం శిబిరాల గురించి మరియు (నేమ్ డేట్ అఫ్ బర్త్ ఆధార్ అప్డేషన్ అండ్ ఈ కేవైసీ (ఎస్ఓపీ) చేసే ప్రక్రియ గ్రీవెన్స్ సవరణలు ఆన్లైన్ లో నమోదు చేయుటకు మీసేవ ఆపరేటర్లకు ఒక రోజు అవగాహన కార్యక్రమం జగిత్యాల కలెక్టరేట్ సమావేశ మందిరములో ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమానికి "మీ సేవ" ఆపరేటర్ లు హాజరయ్యారు హైదరాబాద్ సదరం విభాగము నుండి అధికారులు జూమ్ ద్వారా సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది ముఖ్య అతిథులుగా గౌరవ అడిషనల్ కలెక్టర్ (రెవీన్యూ) అడిషనల్ డిఆర్డిఓ డిపియం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఏఓ ఆర్ఎంఓ ఈడిఎం అడ్మిన్ అసిస్టెంట్ సదరం విభాగం డాటా ఎంట్రీ ఆపరేటర్లు కుమార్ మనోజ్ లు పాల్గొన్నారు




# పేద కుటుంబాలకు నిత్యావసరాల వితరణ

దమ్మపేట ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి )

ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న రెండు పేద కుటుంబాలకు సత్తుపల్లి ప్రాంతానికి చెందిన సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, అనువంశిక ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి అండగా నిలిచారు.. గురువారం ఆ రెండు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యవసరాలు అందించారు.. దమ్మపేట మండలం తొట్టి పంపు గ్రామం హనుమంతుని గుంపుకు పొట్టకూటి కోసం వలసగా వచ్చిన కారం రాజమ్మ, తాటి పెంటయ్య ఈ రెండు కుటుంబాలు. వృత్తిరీత్యా దినసరి కూలీలు కొద్దిరోజులుగా సరైన పని లేక ఇంటి వద్ద ఉంటున్నారు. పూట గడవడం కూడా కష్టమైపోతోంది. ఈ నేపథ్యంలో వీరి పరిస్థితి తెలుసుకున్న సుధారాణి గురువారం ఆ రెండు కుటుంబాలకు బియ్యం,

నెలకు సరిపడా నిత్యవసరాలు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు..

# ఆత్మకూర్ రూపురేఖలు మారుస్తా :మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్ ,ఫిబ్రవరి 26(వుదయం ప్రతినిధి)




రాబోయే కొద్ది రోజుల్లో ఆత్మకూరు రూపు రేఖలు మారుస్తానని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల, పాడి పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు లో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవి కళ్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు.కళ్యాణ మండప ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన మంత్రికి అర్చకులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. వాసవి మాత ఆలయంలో మంత్రి శ్రీహరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ వైశ్యులు అంటే ఒక నమ్మకమని, అన్ని రంగాల్లో వైశ్యులు రాణించగలుగుతున్నారని తెలిపారు.సమాజంలో ప్రజల ఆలోచన విధానాలు మార్చగలిగే శక్తి వైశ్యులకు ఉంటుందన్నారు. కిరాణా కొట్టు నడిపే వ్యాపారికి చుట్టు పక్కల ఉండే ఐదు వందల కుటుంబాలను ప్రభావితం చేసే సామర్థ్యం వారికి ఉంటుందన్నారు.ఆత్మకూరు ప్రాంతం బాగుపడాలనే తపన తో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆత్మకూరు రూపు రేఖలు మారుస్తానని హామీనిచ్చారు.ఎవరూ ఊహించని విధంగా ఆత్మకూరు, అమరచింత ను అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. జూరాలపై బ్రిడ్జి నిర్మించి వనపర్తి నుండి వయా ఆత్మకూరు మంత్రాలయం వరకు 4 లేన్ రోడ్డు మంజూరు అయ్యిందని గుర్తు చేశారు. సాయంత్రం 7 తర్వాత రవాణా బంద్ అయ్యే ఆత్మకూరు లో త్వరలో 24 గంటలు రవాణా సదుపాయం ఉండబోతుందన్నారు. ఎక్కడైతే ట్రాన్స్పోర్ట్ సౌకర్యం ఉంటదో అక్కడే అభివృద్ధి చెందుతుందన్నారు.

పరమేశ్వర చెరువు రోడ్డు పై నుండి చెరువు మీదుగా ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం ఒక కోటి రూపాయలతో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఇప్పటికే ఆత్మకూరు లో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 25 కోట్ల తో హాస్పిటల్ ను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలియజేశారు.5 ఎకరాల భూమి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కి కేటాయించామని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం ప్రారంభమయ్యాయని మంత్రి స్పష్టం చేశారు. ఆత్మకూరు కు రెవిన్యూ డివిజన్ కల సాకారం దిశగాఅడుగులు పడుతున్నాయని వెల్లడించారు.మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని ఓమ్ము చేయనని మంత్రి హామీనిచ్చారు.గతంలోభూ కబ్జాల వల్ల ఆత్మకూరు లో భూములు కొనే పరిస్థితి ఉండేది లేదన్నారు. ఇప్పుడు ధైర్యంగా భూములు కొనొచ్చని భరోసానిచ్చారు.

మీకు ఏ ఆపద వచ్చినా మీకు అండగా వాకిటి శ్రీహరి ఉంటాడని స్పష్టం చేశారు.వాసవి మాతా కళ్యాణ మండపానికి సహకరించిన దాతలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.త్వరలో హైదరాబాద్ లో 40 వేల మంది తో చేయనున్న వాసవి మాతా పారాయణం గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు ను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు మాజీ రాజ్యసభ సభ్యులు టీ జి వెంకటేష్, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత, టీపీసీసీ కల్లుగీత సెల్ ఛైర్మన్ నాగరాజు గౌడ్,ఆత్మకూరు మున్సిపల్ ఛైర్ పర్సన్ నాగమణి, వైస్ ఛైర్ పర్సన్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటి ఛైర్మన్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి తుమ్మలకు దమ్మపేట నాయకుల సంఘీభావం



యూట్యూబ్ చానల్స్ దుష్ప్రచారాన్ని ఖండించిన ఆలపాటి
దమ్మపేట ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర గారిపై కొన్ని యూట్యూబ్ ఛానల్స్ చేసిన దుష్ప్రచారాన్ని తెలంగాణ రాష్ట్ర పామాయిల్ రైతు సంఘం సంక్షేమ అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పామాయిల్ మొక్కలపై మంత్రి తుమ్మలపై ఆరోపణ చేసిన దుష్ప్రచారాన్ని ఖండిస్తూ గత 15 సంవత్సరాలగా ఏమి జరిగిందో వివరించారు. ఈరోజు తన శాఖ పరంగా మంత్రి తుమ్మల గుర్తింపు తెచ్చుకుంటూ పామాయిల్ సాగు విస్తీర్ణం పై దృష్టి పెడుతూ ఉన్న మంత్రిపై అవాకులు చవాకులు పేలుతున్నారని ఆయన ఆరోపించారు. సత్తుపల్లి అశ్వరావుపేట నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న పామాయిల్ రైతులని అడిగితే ఈ పామాయిల్ సాగుపై మంత్రి తుమ్మల కి ఉన్న ప్రత్యేక శ్రద్ధను ఏ రైతైన గంటా పదంగా చెబుతారని ఆలపాటి రామచంద్ర ప్రసాద్ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఆలపాటి తో పాటు సీనియర్ నాయకులు పైడి వెంకటేశ్వరరావు, అచ్యుతరావు,

కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతం పామ్ ఆయిల్ రైతులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్స్ గా ఉద్యోగోన్నతి

కోదాడ ఫిబ్రవరి 26(వుదయం)




కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్ గా పని చేస్తున్న కె.విద్యాసాగర్ హెడ్ కానిస్టేబుల్స్ గా పదోన్నతి పొందారు. ఈమేరకు జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ప్రమోషన్ పొందిన హెడ్ కానిస్టేబుల్ ను ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగోన్నతి తో పాటుగా బాధ్యతలు పెరుగుతాయని బాధ్యతలు కు అనుగుణంగా విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని కోరారు. క్రమశిక్షణతో మెలగాలని, తోటి సిబ్బందిని గౌరవించాలని సమన్వయంతో ముందుకెళ్లాలని కోరినారు. ఆరోగ్యం పట్ల, కుటుంబాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారుఎస్పీ వెంట పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్ సిబ్బంది ఉన్నారు.

## 7వ వార్డు డ్రైనేజీలు సిసి రోడ్లకు నిధుల మంజూరు

టెండర్లు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పణ...

మెట్ పల్లి ఫిబ్రవరి 25 (వుదయం విలేఖరి)



మెట్ పల్లి పట్టణ 7వ వార్డు హనుమాన్ నగర్ ఇస్లాంపూర కు డ్రైనేజీలు సిసి రోడ్లు మంజూరు అయినవి ఇట్టి డ్రైనేజీ సిసి రోడ్లు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ను కోరగా నిధుల మంజూరు చేయడం జరిగిందని అందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రాన్ని అందజేసిన మెట్పల్లి పట్టణ 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ

ఇంచార్జ్ అబ్దుల్ జాకీర్

## కోనాపురం లో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం వేడుకలు

*12వ వార్షిక కళ్యాణ మహోత్సవ జాతర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన గ్రామ పెద్దలు*

నర్సంపేట, ఫిబ్రవరి 26 వుదయం ప్రతినిధి.



వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలంలో ఎంతో ప్రాచుర్యం పొందిన కోనాపురం శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్టపై 27 ఫిబ్రవరి రోజున కళ్యాణ మహోత్సవం జరగనుంది.

కోనాపురం గ్రామంలోని గుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీ బాల ఉగ్ర నరసింహ స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం కళ్యాణ మహోత్సవ జాతర ఉత్సవాలను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ సంవత్సరం కూడా 12వ వార్షిక కళ్యాణ మహోత్సవం సందర్భంగా 27 ఫిబ్రవరి శుక్రవారం రాత్రి 8 గంటలకు ఈ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ అర్చకులు కసిచొజ్జల శివకృష్ణచార్యులు వెల్లడించారు. గురువారం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, గ్రామ యువకుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవ జాతర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ జాతర ఉత్సవాల్లో భాగంగా 27 ఫిబ్రవరి శుక్రవారం రోజు రాత్రి 8 గంటలకు స్వామివారి కళ్యాణం, 3 మార్చి మంగళవారం రోజున జాతర (ప్రభ బండ్లు), 7 మార్చి శనివారం రోజున స్వామి వారి రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్వయంభుగా వెలిసిన శ్రీ బాల ఉగ్ర నరసింహ స్వామి, పాదాలు, పకృతి సాహసిద్ధంగా ఏర్పడిన కోనేరు మరెన్నో ప్రత్యేకలు కలిగిన ఈ దేవాలయాన్ని, జరగబోయే కళ్యాణ మహోత్సవాన్ని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు,

అధికారులు హాజరై శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అనుగ్రహం పొందాలని ఆలయ అర్చకులు గ్రామ పెద్దలు కోరారు.

## అంధ విద్యార్థులకై ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ ప్రారంభం

నల్లగొండ , (వుదయం జిల్లా ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో ప్రప్రథమంగా అంధ విద్యార్థులకై ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ సదుపాయాలను నల్లగొండ జిల్లా గ్రంథాలయంలో ప్రారంభించడం గర్వకారణమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం ఏ ఆఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బ్లైండ్ (దృష్టి లోపం ఉన్న) పాఠకులు, విద్యార్థులకై ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ ను ఆయన ప్రారంభించారు. విద్య అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని, ఇందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్లైండ్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన సదుపాయాలు, బ్రెయిలి పుస్తకాలు, ఆడియో బుక్స్, ఈ-బుక్స్, స్క్రీన్ రీడర్ సాఫ్ట్వేర్‌తో కూడిన కంప్యూటర్లు, ప్రత్యేకంగా చదువుకునే విభాగం, సహాయక సాంకేతిక పరికరాలు ఉపయోగించుకోవాలని చెప్పారు.అనంతరం 2026–27 సంవత్సరానికి సంబంధించిన జిల్లా గ్రంథాలయ సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. వార్షిక బడ్జెట్‌కు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్ ద్వారా గ్రంథాలయాల అభివృద్ధి, పుస్తకాల కొనుగోలు, భవనాల మరమ్మతులు, డిజిటల్ లైబ్రరీ విస్తరణ, భద్రతా చర్యలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలో అవసరమైన చోట పబ్లిక్ రీడింగ్ సెంటర్లు ప్రారంభిస్తామన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు గ్రంథాలయ సెస్ ను సకాలంలో చెల్లించాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రంథాలయాన్ని సమగ్ర జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని చైర్మన్ స్పష్టం చేశారు.

## తిరుమల ఘాట్ రోడ్డుపై ప్రమాదం

తిరుమల ,ఫిబ్రవరి 26 (వుదయం ప్రతినిధి):

తిరుమల ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మొదటి ఘాట్ రోడ్డులోని అత్యంత ప్రమాదకరమైన మలుపుల్లో ఒకటైన 30వ మలుపు వద్ద ఈ ఘటన జరిగింది.తమిళనాడులోని అరక్కోణం తాలుకా మిట్టపిట్టై గ్రామానికి చెందిన నటరాజన్, మునిరత్నం శ్రీవారి దర్శనం కోసం బైక్‌పై తిరుమలకు వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా మొదటి ఘాట్ రోడ్డులోని 30వ మలుపు వద్ద వారి వాహనం అదుపుతప్పింది. అతి వేగంగా వెళ్తున్న బైక్ నేరుగా రోడ్డు పక్కన ఉన్న పిట్టగోడను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు ఎగిరిపడ్డారు.

# చక్కని ఆరోగ్యం

## పొట్ట పైన దురద.. ఉపశమనమిలా..!



గర్భం ధరించాక శరీరంలో పలు మార్పులు చోటుచేసుకుంటాయి. కడుపులో బిడ్డ ఎదుగుతున్న కొద్దీ పొట్ట పెరగడం కూడా ఇందులో ఒకటి. అయితే ఇలా చర్మం సాగే క్రమంలో దురద పెట్టడం సహజం. అలాగని ఆ ప్రదేశంలో గోకడం వంటివి చేస్తే చర్మం గీరుకుపోయి మచ్చలు ఏర్పడతాయి. అందుకే పొట్ట పెరుగుతున్నా దురద రాకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. శరీరం తేమను కోల్పోయినా దాని ప్రభావం చర్మంపై పడుతుంది. అది పొడిబారి దురద పెడుతుంటుంది. అందుకే గర్భిణిగా ఉన్నప్పుడు తగినన్ని నీళ్లు తాగడం మంచిది.

ఫలితంగా చర్మం తేమగా ఉండి దురద సమస్య తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. చర్మం పొడిబారకుండా చేయడంలో మాయిశ్చరైజర్ పాత్ర కూడా కీలకమే! అందుకే నిపుణుల సలహా మేరకు.. సువాసన రహిత మాయిశ్చరైజర్లను పొట్టకు అప్లై చేసుకోవడం మంచిది. గర్భిణిగా ఉన్న సమయంలో బిగుతుగా ఉండే దుస్తులు ధరించడం, వాటి రాపిడి వల్ల కూడా పొట్ట వద్ద చర్మం దురద పెడుతుంటుంది. అందుకే ఈ సమయంలో వదులుగా, శరీరానికి గాలి తగిలేలా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా దురద పెట్టకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు. కొంతమంది ఏ కాలంలోనైనా వేడి నీటితో స్నానం చేస్తుంటారు. దీనివల్ల కూడా చర్మం పొడిబారిపోయి దురద పెట్టే అవకాశాలు ఎక్కువ. అందుకే గోరువెచ్చటి నీళ్లను స్నానానికి ఉపయోగించడం మంచిదంటున్నారు. కావాలంటే ఇందులో కాస్త ఓట్‌మీల్ కలుపుకొన్నా దురద రాకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు. అలాగే స్నానానికి ఉపయోగించే సబ్బులు, బాడీ వాష్‌లు.. గాఢత తక్కువగా ఉన్నవి, పరిమళభరితం కానివి ఎంచుకోవాలంటున్నారు నిపుణులు. పెరిగే పొట్టపై స్ట్రెచ్ మార్క్స్ పడకుండా, దురద పెట్టకుండా.. కొన్ని రకాల క్రీమ్స్, నూనెలు దోహదం చేస్తాయి. వాటిని నిపుణుల సలహా మేరకు వాడడం ఉత్తమం. పొట్ట పెరుగుతున్న కొద్దీ సాగుతున్న చర్మం దురద పెట్టకుండా ఉండాలంటే.. స్నానం చేశాక.. కాస్త కలబంద గుజ్జు లేదంటే కొబ్బరి నూనెను అప్లై చేసుకున్నా ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. గర్భిణులందరి చర్మతత్వాలు ఒకేలా ఉండాలని లేదు. కాబట్టి పొట్ట పెరిగే కొద్దీ దురద నుంచి ఉపశమనం పొందడానికి ఎలాంటి ఉత్పత్తి వాడాలన్నా ముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. తద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు తలెత్తకుండా జాగ్రత్తపడచ్చు.

## జిడ్డుకు చెక్ పెట్టాలంటే..!

ఏ కాలమైనా జిడ్డు చర్మంతో బాధపడే అమ్మాయిలు చాలామందే ఉంటారు. అయితే ఈ చర్మతత్వం మొటిమలు, మచ్చలకు కారణమవుతుంది. అందుకే కొన్ని ఇంటి చిట్కాలతో ఈ సమస్యను దూరం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. పాలను ముఖానికి అప్లై చేసుకొని పావుగంటయ్యాక కడిగేసుకోవాలి. తద్వారా చర్మంపై జిడ్డుదనం తొలగుతుందట. జిడ్డుకు కారణమయ్యే సీబమ్ ఉత్పత్తి కూడా అదుపులోకొస్తుందట. తేనెతోనూ ముఖంపై జిడ్డుదనాన్ని తొలగించచ్చు. ఇందుకోసం తేనెను ముఖానికి పూతలా వేసుకోవాలి. 15 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. నిమ్మరసంతో తయారుచేసిన ఐస్‌క్యూబ్‌తో ముఖాన్ని రుద్దుకున్నా చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. గుడ్డులోని తెల్లసొన, ద్రాక్షరసం, నిమ్మరసం.. ఈ మూడింటినీ కొద్ది మొత్తాల్లో తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పూసుకొని పావుగంట తర్వాత కడిగేసుకోవాలి. నిమ్మరసం సహజసిద్ధమైన క్లెన్సర్‌గా పనిచేస్తుంది, గుడ్డులోని తెల్లసొన చర్మం బిగుతుగా మారడానికి, ద్రాక్షరసం చర్మం మృదువుగా మారడానికి ఉపకరిస్తాయట. సాధారణంగా ఆయిలీ స్కిన్ ఉన్న వారు ఎక్కువ సార్లు ముఖం కడుక్కుంటూ ఉంటారు. ఇది మంచిది కాదు. ఎందుకంటే ఈ క్రమంలో పదే పదే సోప్ లేదా ఫేస్‌వాష్ వాడితే.. వాటిలో ఉండే రసాయనాలు చర్మాన్ని పొడిబారేలా చేస్తాయి. కాబట్టి సాధారణ నీటితో రోజుకు రెండు లేదా మూడుసార్లు ముఖం శుభ్రం చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.



## బాడీ లోషన్ రాస్తున్నారా..?

ఎప్పటికప్పుడు మారే వాతావరణం చర్మం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. తద్వారా చర్మం పొడిబారి నిర్జీవంగా మారుతుంది. అయితే చర్మంలో తేమని నిలిపి ఉంచడానికి ఏదో ఒక క్రీమ్/బాడీ లోషన్ రాసుకుంటే సరిపోతుందనుకుంటారు చాలామంది. కానీ వీటిలో కూడా చర్మతత్వానికి నప్పే లోషన్లను ఎంచుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. అలాగే వీటిని ఉపయోగించే క్రమంలోనూ పలు జాగ్రత్తలు పాటించాలంటున్నారు. అప్పుడే ఫలితం ఉంటుం దని చెబుతున్నారు. ముఖానికి లేదా చర్మానికి క్రీమ్‌లు, లోషన్లు.. మొదలైనవి రాసుకునే ముందు చర్మాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. అలాగే చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడే వాటిని రాసుకోవాలి. అప్పుడే అది చర్మ గ్రంథుల్లోకి చేరే అవకాశం ఉంటుంది. తద్వారా చర్మం తేమను కోల్పోకుండా జాగ్రత్తపడచ్చు. క్రీమ్ లేదా బాడీ లోషన్స్ ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా.. స్నానం చేసిన వెంటనే రాసుకోవాలి. ఎందుకంటే ఆ సమయంలో చర్మంలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల లోషన్ రాసుకుంటే మంచి ఫలితం ఉంటుందట. అలాగే స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టిన తర్వాత కూడా తప్పకుండా క్రీమ్ లేదా బాడీ లోషన్ రాసుకోవాలి. లేదంటే నీటిలో ఉండే క్లోరిన్ వల్ల చర్మం మరింత పొడిగా మారే ప్రమాదం ఉంటుంది. అలాగే చర్మం కాస్త వేడిగా ఉన్నప్పుడే క్రీమ్ లేదా లోషన్స్ రాసుకుంటే అవి చర్మంలోకి సులభంగా ఇంకుతాయంటున్నారు నిపుణులు. అందుకే క్రీమ్ లేదా లోషన్ రాసుకునే ముందు చర్మం చల్లగా అనిపిస్తే.. గోరువెచ్చని నీళ్లలో ముంచిన టవల్‌తో తుడుచుకొని ఆపై లోషన్‌ను చర్మానికి అప్లై చేసుకోవాలంటున్నారు. పొడిబారి నిర్జీవంగా మారిపోయిన చర్మానికి క్రీమ్ లేదా లోషన్ రాసుకోవడం వల్ల అది తేమను సంతరించుకోవడంతో పాటు పునరుత్తేజితం అవుతుంది. బాడీ లోషన్ చర్మంపై ఉన్న మచ్చల్ని క్రమంగా తగ్గించడానికీ ఉపయోగపడుతుంది. అలాగే బాడీ లోషన్ వెదజల్లే పరిమళాలు మానసిక ప్రశాంతతనూ అందిస్తాయి. గరుకుగా ఉండే చర్మ భాగాలపై తరచుగా క్రీమ్ లేదా లోషన్స్ అప్లై చేయడం వల్ల కొన్నాళ్లకు అవి మృదువుగా మారతాయంటున్నారు నిపుణులు.



## రాత్రి... అలా వద్దు!

మార్నింగ్, నైట్ రొటీన్లు... ఇప్పుడు చాలామంది పాటిస్తున్నదే! అంటే పగలు ఒక క్రీము, రాత్రి ఒక క్రీము ఇలాగన్నమాట. ఇంకా ఆసక్తి ఉన్నవాళ్లు హెవీ క్రీములు, నూనెలు, ఓవర్‌నైట్ మాస్కులు అంటూ ఇంకా చాలానే ప్రయత్నిస్తుంటారు. వీటన్నింటితో చర్మం ఇంకా బాగా రిపేర్ అవుతుంది అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదు అంటున్నారు నిపుణులు. పగలు వేడి, దుమ్ము... చర్మం ఇలా ఎన్నింటి బారినో పడుతుందని తెలుసుగా? రిపేర్ చేసుకోవడానికి దానికి రాత్రి బాగా సాయపడుతుంది. ఆ సమయంలో కణాల పునరుత్పత్తి, కొలాజెన్ పెరుగుదల, చర్మం తిరిగి పునరుత్తేజం పొందడం వంటివి జరుగుతాయి. అయితే అందుకు తగిన తేమ, పోషకాలు కావాలి. ఇలా చర్మంపై పేరుకుని పోయినట్లుగా ఉండేవి కాదు. పొడిచర్మం వాళ్లయితే సెరమైడ్స్, ఫ్యాటీ యాసిడ్లు ఉన్నవి వాడొచ్చు. అదే జిడ్డు, మొటిమలు ఎక్కువగా వచ్చేవాళ్లు వీటిని వాడితే మొటిమలు పెరుగుతాయి. కాబట్టి, మీ చర్మానికి తగ్గట్టుగా అలా ఏం కావాలో తెలుసుకోండి. అలాగే వృద్ధాప్య ఛాయలు రావొద్దంటూ చాలామంది రెటినాయిడ్స్‌ని వాడుతున్నారు. దాంతోపాటు ఎక్స్‌ఫోలియేటింగ యాసిడ్ ఉన్నవి రాస్తే సమస్య తగ్గక పోగా పెద్దదవుతుంది. రెటినాల్‌తోపాటు బెంజైల్ పెరాక్సైడ్, విటమిన్ సి వంటివి వాడినా సమస్యే. దానికి హైలురోనిక్ యాసిడ్, గ్లిజరిన్, నియాసినమైడ్, పెప్టైడ్‌లు ఉన్న క్రీములు జతగా వాడుకోవచ్చు. కాబట్టి, ఏవి అనువైనవో తెలుసుకోండి. జోడీ కుదురుతుందా అన్నదీ గమనించుకోండి. అలాగే అన్నీ ఒక్కసారిగా రాస్తూ వెళ్లకండి. నిపుణుల సాయంతో ఎంచుకోండి. మొత్తంగా మీరు రాసేవి ఏవైనా చర్మం తిరిగి కోలుకోవడానికి సాయపడాలే కానీ దానికి ఇబ్బంది కలిగించేదిగా మారొద్దు. మరి గమనించుకుంటారుగా!



## పెరుగు పులవకుండా..

చివరి ముద్ద పెరుగుతో తిననిదే భోజనం చేసినట్లు ఉండదు చాలామందికి. ఇది మహిళలకు ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా వెజైనల్ ఇన్ఫెక్షన్లు, ఎముకల బలహీనత, హార్మోన్ల అసమతుల్యత వంటివాటిని అడ్డుకుంటుంది. అయితే, ఇది పుల్లగా అయితే, చాలామంది తినలేరు. అసలే రానున్నది వేసవి కాలం. ఇట్టే పులుస్తుంది. అలాకాకుండా కమ్మగా, రుచిగా ఉండాలంటే... పాలను బాగా మరిగించి గోరు వెచ్చగా ఉన్నప్పుడే తోడు వేయాలి. అది కూడా పుల్లగా లేకుండా చూసుకోవాలి. తోడు కాస్త తక్కువ వేయండి. వేసవికాలంలో చల్లగా ఉండే ప్రదేశంలో, వర్షాకాలం, చలికాలంలో వెచ్చగా ఉన్న చోట దీన్ని ఉంచాలి. అల్యూమినియం, ఇనుప పాత్రల్లో పెరుగు తోడు పెట్టొద్దు. ఇవి పుల్లదనాన్ని పెంచుతాయి. మట్టికుండ, ఎయిర్‌టైట్ గాజు, సెరామిక్ పాత్రల్లో తోడు పెట్టొచ్చు. మట్టికుండ చల్లగా ఉండటంతో పెరుగు త్వరగా తయారవుతుంది. సాధారణంగా ఉదయం, రాత్రిపూట పెరుగు తోడు పెడుతుంటాం. రాత్రిపూట కాకుండా సాయంత్రం ఆరు గంటల వేళ తోడు పెడితే అది అయిదారు గంటల్లో తోడుకుంటుంది. ఆ పెరుగును ఫ్రిజ్‌లో పెడితే మరుసటి రోజుకి తియ్యగా మారుతుంది. పెరుగును ఎల్లప్పుడూ ఫ్రిజ్‌లోనే భద్రపరచాలి. అరలో వెనక్కి పెడితే దానికి కావాల్సినంత చల్లదనం అందుతుంది. మరో సంగతి ఏమిటంటే... పెరుగు గిన్నెపై మూత తప్పనిసరి. మూత లేకపోతే మిగిలిన పదార్థాల వాసనలు పెరుగులో కలిసిపోయి అది పులిసిపోతుంది. తోడు పెట్టేటప్పుడు అందులో ఓ తమలపాకో, ఎండుమిర్చో వేస్తే పులుపు రాదు.



## బంగాళాదుంపల్ని ఇలా కూడా వాడచ్చట!



బంగాళాదుంపతో చేసే కూరలన్నా, వంటకాలన్నా మనకు చాలా ఇష్టం. పలు చర్మ సమస్యల్ని తగ్గించి మేని ఛాయను పెంచే సుగుణాలూ ఇందులో బోలెడున్నాయి. అయితే ఇలా అందాన్ని, ఆరోగ్యాన్ని అందించే ఈ దుంప.. పాత్రలపై పేరుకున్న తుప్పును కూడా వదిలిస్తుందని మీకు తెలుసా? అంతేకాదు.. సహజసిద్ధమైన క్లీనింగ్ ఏజెంట్‌గా పనిచేసే ఈ దుంపలు పలు ఇంటి అవసరాలకూ ఉపయోగపడతాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందాం రండి. వాతావరణంలోని తేమ కారణంగా ఐరన్, స్టీలు పాత్రలు తుప్పు పట్టడం సహజమే! అయితే దీన్ని వదిలించడానికి స్టీల్ స్క్రబ్బర్ వంటివి వాడితే పాత్ర త్వరగా పాతబడిపోతుంది.. మెరుపూ తగ్గిపోతుంది. అందుకే దానికి బదులు బంగాళాదుంపను ఉపయోగిస్తే చక్కటి ఫలితం ఉంటుంది. ఈ క్రమంలో ఆలూను మందపాటి స్లైసుల్లా కట్ చేసుకోవాలి. ఒక స్లైస్‌ను గిన్నెలు తోమే సోప్ లిక్విడ్‌లో ముంచి లేదంటే బేకింగ్ సోడాలో అద్ది.. తుప్పు ఉన్న చోట నెమ్మదిగా రుద్దాలి. ఫలితంగా తుప్పు వదిలిపోయే అవకాశం ఉంటుందట. ఆ తర్వాత డిష్‌వాషింగ్ లిక్విడ్‌తో శుభ్రం చేసి పొడిగా తుడిచి ఆరబెడితే సరిపోతుంది. ఇక తుప్పు పట్టిన వంటింటి కత్తులపై బంగాళాదుంప ముక్కతో రుద్ది ఓ ఐదు నిమిషాల పాటు పక్కన పెట్టేయాలి. ఆ తర్వాత సాధారణ నీటితో కడిగి పొడిగా తుడిచేస్తే ఫలితం ఉంటుందట. గాలి తగిలి వెండి ఆభరణాలు నల్లగా మారడం మనకు తెలిసిందే! ఇలాంటప్పుడు బంగాళాదుంపలు మరిగించిన నీళ్లతో వెండి వస్తువుల్ని శుభ్రం చేయడం మంచిదంటున్నారు నిపుణులు. అది కూడా నీళ్లు బాగా వేడిగా, మరీ చల్లగా ఉండ కుండా చూసుకోవాలి. ఈ నీటిలో ఆయా వస్తువుల్ని వేసి గంటపాటు వదిలేసి ఆ తర్వాత బ్రష్‌తో శుభ్రం చేయాలి. ఈ నీళ్లలో ఉండే స్టార్చ్ నల్లగా మారిన వెండి ఆభరణాలు/వస్తువుల్ని తిరిగి మెరిపించే అవకాశం ఉంటుందంటున్నారు. వంట చేసే క్రమంలో ఒక్కోసారి గిన్నెలు అడుగంటుతుంటాయి. అయితే దీన్ని వదిలించాలన్నా అందుకు బంగాళాదుంప చక్కగా పనిచేస్తుందట. ఇందుకోసం మందపాటి స్లైస్‌లా కట్ చేసిన ఆలూ ముక్కను నిమ్మరసంలో ముంచి మాడిన ప్రదేశంలో రుద్దాలి. ఆ తర్వాత దాన్ని ఓ అరగంట పాటు అలాగే వదిలేయాలి. ఇప్పుడు సబ్బు నీటితో నెమ్మదిగా రుద్ది కడిగితే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.

## సెరామిక్ పాత్రలు.. శుభ్రం చేయాలంటే..!

ఇంటికి అతిథులొచ్చినప్పుడు హుందాగా కనిపించడమే కాదు.. వంటా వార్పు విషయాల్లోనూ హుందాగా వ్యవహరిస్తుంటాం. వంట చేసేటప్పుడు ఉపయోగించే పాత్రలైనా, వడ్డించేటప్పుడు వాడే ప్లేట్స్ అయినా కాస్త ఖరీదైనవి ఎంచుకుంటాం. అలాంటి వంట పాత్రల్లో సెరామిక్ కుక్‌వేర్ ముందు వరుసలో ఉంటుంది. అయితే వీటిని వినియోగించడం వరకే కాదు.. శుభ్రపరిచే విషయంలోనూ పలు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. అప్పుడే అవి ఎక్కువ కాలం మన్నుతాయంటున్నారు. మరి, సెరామిక్ వంట పాత్రల్ని ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం రండి.. కొంతమంది సమయం లేకపోవడం వల్లో లేదంటే త్వరగా పని పూర్తి చేసుకోవాలన్న ఉద్దేశంతోనో.. వేడిగా ఉన్నప్పుడే సెరామిక్ పాత్రల్ని శుభ్రం చేస్తుంటారు. వాటిని కుళాయి కింద పెడితే చల్లబడతాయనుకుంటారు. అయితే ఇలా ఉష్ణోగ్రతలో ఉన్నట్లుండి మార్పు రావడం వల్ల వాటిపై ఉండే నాన్‌స్టిక్ కోటింగ్ తొలగిపోయే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అందుకే వంట పూర్తయ్యాక అవి సాధారణ గది ఉష్ణోగ్రత వద్దకొచ్చాక మాత్రమే వాటిని శుభ్రం చేయాలంటున్నారు. ఒకవేళ సెరామిక్ పాత్రలు మాడిపోయినట్లయితే.. అలాంటి వాటిని బేకింగ్ సోడాతో శుభ్రం చేయచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పాత్రలో పొడి బేకింగ్ సోడాను చల్లాలి. ఆపై మృదువుగా ఉన్న స్పాంజితో గుండ్రంగా రుద్దాలి. ఆపై సాధారణ డిటర్జెంట్‌తో కడిగేస్తే సరిపోతుంది. ఇక బేకింగ్ సోడా, గోరువెచ్చటి నీళ్ల మిశ్రమంతో ఈ పాత్రల్ని శుభ్రం చేసినా సమాన ఫలితం ఉంటుందట. ఒక వంతు వెనిగర్‌కు నాలుగు వంతుల నీళ్లు తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీన్ని శుభ్రం చేయాల్సిన సెరామిక్ పాత్రలో పోసి.. రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే సబ్బుతో శుభ్రం చేస్తే.. వంట చేసే క్రమంలో వాటిపై ఏర్పడిన మరకలు, జిడ్డుదనం.. అన్నీ తొలగిపోయే అవకాశం ఉంటుందట. టేబుల్‌స్పూన్ చొప్పున ఉప్పు, వెనిగర్ తీసుకొని మిశ్రమంగా తయారుచేసుకోవాలి. దీంతో ముందుగా సెరామిక్ పాత్రలు/ప్లేట్స్ శుభ్రం చేసి.. ఆపై డిటర్జెంట్‌తో కడిగేస్తే అవి కొత్తవాటిలా మెరుస్తాయట. వంట త్వరగా పూర్తవ్వాలన్న ఉద్దేశంతో కొంతమంది ఎక్కువ మంటపై వంట చేస్తుంటారు. సెరామిక్ పాత్రల్ని ఇలా పెద్ద మంటపై ఉంచితే వాటిలోని నాన్‌స్టిక్ కోటింగ్ త్వరగా పోతుంది.. కాబట్టి సెరామిక్ పాత్రల్ని చిన్న మంట పైనే పెట్టి వంట చేయడం మంచిదంటున్నారు నిపుణులు. సెరామిక్ ప్లేట్స్‌లో ఆహార పదార్థాలు కట్ చేయడం, వాటిపై పడిన మరకలు తొలగిపోవాలని గరుకైన స్క్రబ్బర్‌తో వాటిని రుద్దడం.. వంటివి చేస్తే వాటిపై ఉండే నాన్‌స్టిక్ కోటింగ్ తొలగిపోయి.. గీతలు పడతాయి. సెరామిక్ పాత్రల్ని డిష్‌వాషర్‌లో వేయడం, వాటిని శుభ్రం చేయడానికి బ్లీచ్–ఆమ్ల గుణాలున్న పదార్థాల్ని వాడడం.. వంటివి చేసినా అవి త్వరగా పాడవుతాయట. కాబట్టి వీటికి దూరంగా ఉండడం మంచిది. సెరామిక్ పాత్రలు ఎక్కువ కాలం మన్నాలంటే వాటి ఉపయోగం, వాడకం.. వంటి విషయాల్లోనే కాదు.. వాటిని భద్రపరిచేటప్పుడూ పలు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా కడిగిన పాత్రల్ని తేమగా ఉన్నప్పుడు కాకుండా.. ఒక కాటన్ క్లాత్‌తో వాటిని పొడిగా తుడిచి.. కాసేపు గాలికి పూర్తిగా ఆరాకే వాటిని అల్మరాలో భద్రపరచాలి అంటున్నారు నిపుణులు.



## అనిల్ అంబానీ నివాసం అటాచ్ చేసిన ఈడీ



రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన ముంబయి నివాసం 'అబోడ్'ను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. 17 అంతస్తులతో 66 మీటర్ల ఎత్తున్న ఈ విలాసవంతమైన ఇల్లు.. ముంబయిలోని పాలి హిల్ ప్రాంతంలో ఉంది. దీని విలువ సుమారు రూ.3,716 కోట్లు ఉంటుందని అంచనా. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.




# ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసానికి మాస్టర్‌మైండ్ అతడే..!




ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590కోట్ల మోసం ఘటన బ్యాంకింగ్ రంగంలో సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఈ కుంభకోణం సూత్రధారి బ్యాంకు మాజీ ఉద్యోగేనని తేలింది. బ్యాంకింగ్ ప్రక్రియను తారుమారు చేసి ప్రభుత్వానికి చెందిన ఈ నిధులను అతడు షెల్ కంపెనీలకు మళ్లించినట్లు వెల్లడైంది. దీంతో ఆ మాస్టర్‌మైండ్ సహా అతడికి సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. హరియాణా (Haryana)లో చండీగఢ్‌లోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ శాఖలో జరిగిన మోసం కేసులో నలుగురు నిందితులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితులను రిభవ్ రిషి, అభయ్ కుమార్, అభిషేక్ సింగ్లా, స్వాతి సింగ్లాగా గుర్తించారు. వీరిలో ఇద్దరు గతంలో ఐడీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేసిన ఉద్యోగులు కాగా.. మరో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులని పోలీసులు తెలిపారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాజీ మేనేజర్ అయిన రిభవ్ రిషి ఈ మోసానికి మాస్టర్‌మైండ్ అని, అతడే ఈ కుట్ర మొత్తాన్ని అమలుచేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రిషి చండీగఢ్‌లోని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నిందితులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. హరియాణా ముఖ్యమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన-2.0 స్కీమ్‌కు సంబంధించిన నిధులను జమ చేసేందుకు ఆ విభాగం అధికారులు 2025 సెప్టెంబరు 26న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో రెండు ఖాతాలు తెరిచారు. తొలుత ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.50కోట్లు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో రూ.25 కోట్లు జమ చేశారు. అయితే, ఆ నిధులను వినియోగించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ఈ ఖాతాలను మూసివేయాలని ప్రభుత్వ అధికారులు నిర్ణయించుకున్నారు. ఆ ఖాతాల్లో ఉన్న డబ్బు మొత్తాన్ని వడ్డీతో సహా మరో ఖాతాకు బదిలీ చేయాలంటూ ఈ రెండు బ్యాంకులకు ఈ ఏడాది జనవరి 13న లేఖలు పంపారు. దీంతో జనవరి 16న ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.25.45 కోట్లను హరియాణా ప్రభుత్వానికి చెందిన మరో అకౌంట్‌కు బదిలీ చేసి తమ ఖాతాను మూసేసింది. అయితే, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాత్రం కేవలం రూ.1.27 కోట్లను మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో ఖాతాలో ఉన్న రూ.50 కోట్ల నిధులు ఏమయ్యాయని హరియాణా ప్రభుత్వ విభాగం బ్యాంకును ప్రశ్నించింది. దీనికి బ్యాంకు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విచారణ కమిటీ వేసింది. ఈ విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఆ ఖాతా నుంచి నిధులను షెల్ కంపెనీలకు చెందిన మరో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. ఈ కుట్రంతా రిభవ్ రిషినే చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బ్యాంకులో నిర్వహణపరమైన లోపాలు కూడా బయటపడ్డాయి. తప్పుల తడకగా కొన్ని లావాదేవీలను నిర్వహించినట్లు తెలిసింది. దీంతో గుట్టు లాగగా.. ప్రభుత్వ ఖాతాల్లోని మొత్తం రూ.590 కోట్ల నిధులను దారి మళ్లించినట్లు తేలింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ఇప్పటికే ఆ సొమ్ము మొత్తాన్ని రికవరీ చేసినట్లు హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ వెల్లడించారు. ఈ మోసం నేపథ్యంలో ప్రభుత్వ ఖాతాలను నిర్వహించకుండా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌పై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు.

# మరోసారి ట్రంప్ టార్గెట్‌లో భారత్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. మన దగ్గరి నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సోలార్ ఉత్పత్తులపై (Solar Imports) ప్రాథమికంగా 126 శాతం డ్యూటీ విధించారు. ఇండోనేసియాపై ప్రాథమిక సుంకాలను 86 శాతం నుంచి 143 శాతానికి పెంచారు. లావోస్‌పై 81 శాతం డ్యూటీ వేశారు. ఫారెన్ సబ్సిడీల ఆధారంగా రేటును నిర్ధరించినట్లు అమెరికా వాణిజ్య శాఖ వెల్లడించింది. ఈ మూడు దేశాల నుంచి అగ్రరాజ్యానికి దిగుమతి అవుతోన్న సెల్స్, ప్యానెల్స్ వంటి సోలార్ దిగుమతుల విలువ 4.5 బిలియన్ డాలర్లని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తమ సోలార్ ఉత్పత్తు



లపై ఈ దేశ ప్రభుత్వాలు అసంబద్ధ రీతిలో సబ్సిడీలు ఇస్తున్నాయని ట్రంప్ (Donald Trump) ప్రభుత్వం వాదిస్తోంది. అమెరికా ఫస్ట్ విధానానికి ట్రంప్ తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక తయారీని ప్రోత్సహించడానికి తాపత్రయపడుతున్నారు. ఈ అధిక డ్యూటీ కారణంగా అమెరికా వినియోగదారులు సోలార్ దిగుమతులపై ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. ప్రపంచ దేశాలపై ఇప్పటికే ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఈ డ్యూటీ విధింపు ప్రాధాన్యం సంతరించుకుంది.

# మణికొండలో 'చిటికి లూమ్స్' ప్రారంభం

**- చేనేత కమ్యూనిటీ నుంచి యువత ముందుకు రావాలి**

**- ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్**




**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** తెలంగాణ చేనేత కళా వైభవాన్ని, ఆధునిక డిజైన్లను మేళవిస్తూ వైషూస్ హ్యాండ్లూమ్స్ హ్యాండిక్రాఫ్ట్స్ అండ్ ఆర్గానిక్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చిటికి లూమ్స్' నూతన షోరూమ్ ను తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మణికొండలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కంపెనీ ఓనర్ వైష్ణవి నిఫ్ట్ స్టూడెంట్ కావడం, ప్రధానమంత్రి గారి 'లఖ్ పతి దీదీ' ప్రోగ్రాం కింద శిక్షణ పొందడం చాలా గొప్ప విషయమన్నారు. ఇది కేవలం అమ్మకాల కోసమే కాదని, ఒక 'డెమో లూమ్' (మగ్గం) కూడా ఇక్కడ చేయడం జరిగిందని తెలిపారు. పవర్ లూమ్ మీద యంత్రం చేసే పని గంటల్లో అయిపోవచ్చు కానీ, చేనేత మగ్గం మీద అదే పని చేయడానికి కనీసం ఐదు రోజుల సమయం పడుతుందని చెప్పారు. ఆ కష్టాన్ని, ఆ కళను కస్టమర్లు నేరుగా చూసి అర్థం చేసుకున్నప్పుడే, మన చేనేత ఉత్పత్తులకు విలువ పెరుగుతుందన్నారు. పాశ్చాత్య దేశాల్లో చేతి పనికి ఎంత డిమాండ్ ఉందో మనందరికి తెలుసన్నారు. ఇక్కడ ఒకే చోట పెయింటింగ్, ఎంబ్రాయిడరీ కలయికతో కూడిన ఇక్కత్, గద్వాల్, కంచి, ధర్మవరం వంటి సౌత్ సిల్క్స్ అన్నీ ఒక అందమైన 'బొకే' లాగా కొలువుదీరాయన్నారు. కస్టమర్ల అభిరుచికి తగ్గట్టు డిజై



న్లను అందించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వం ఎన్ని ప్రోత్సాహకాలు అందించినా యువత ఈ రంగంలోకి ముందుకు రానంత కాలం చేనేత కళకు భవిష్యత్తు ఉండదన్నారు. యువతరం కొత్త టెక్నాలజీతో, ఆధునిక ఆలోచనలతో ముందుకు వస్తేనే ఈ రంగం నిలబడుతుందని చెప్పారు. అందుకే ప్రభుత్వం కూడా ఎంఎస్‌ఎంఈ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తోందన్నారు. చేనేత కమ్యూనిటీ నుంచి యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చేనేత అభివృద్ధి కమిషనర్ డాక్టర్ ఎస్ అరుణ్ కుమార్ 'చిటికి లూమ్స్' షోరూమ్ ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా ఈ సంస్థ సీఈఓ వైష్ణవి కేవలం ఒక వ్యాపారవేత్త మాత్రమే కాదని, చేనేత రంగంపై అవగాహన ఉన్న నిఫ్ట్ విద్యార్థిని అన్నారు. భారత ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి రకరకాల పథకాలను అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా ఒక ప్రోగ్రాం ద్వారా ఆమె చెన్నైలో అత్యున్నత స్థాయి శిక్షణ పొందారన్నారు. ఆమె సొంతంగా చేనేత కమ్యూనిటీకి చెందిన వ్యక్తి కావడం, దానికి తోడు నిఫ్ట్‌లో డిజైనింగ్ నేర్చుకోవడం లఖ్ పతి దీదీగా ఎంపికవ్వడం ఇవన్నీ అద్భుతమైన ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటుకు దారితీశాయన్నారు. యువత ఇలాంటి బాధ్యతను తీసుకున్నప్పుడే మన చేనేత కళ అంతర్జాతీయ స్థాయికి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండ్వేమ్ సీఈఓ, విజువల్ ఆర్టిస్ట్, స్కిల్స్ ట్రైనర్, సినీ నటి గీతా దాస్యం భాస్కర్ పాల్గొన్నారు.




## రెండో రోజూ దుమ్మురేపిన జమ్ముకశ్మీర్ బ్యాటర్లు



కర్ణాటకతో రంజీ ట్రోఫీ ఫైనల్‌లో జమ్ముకశ్మీర్ బ్యాటర్లు దుమ్మురేపారు. రెండో రోజు ఆట ముగిసేసరికి జమ్ముకశ్మీర్ ఆరు వికెట్ల నష్టానికి 527 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఒక సెంచరీ, ఐదు అర్ధశతకాలు నమోదు కావడం గమనార్హం. కర్ణాటక బౌలర్లు ఎంత శ్రమించినా ఆలౌట్ చేయలేకపోయారు. ప్రస్తుతం క్రీజ్‌లో సాహిల్ లోత్రా (57★), అబిద్ ముస్తాక్ (20★) ఉన్నారు. వర్షం రావడంతో ఇవాళ గేమ్ ముందుగానే ముగిసింది. ఓవర్‌నైట్ 284/2 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన జమ్ముకశ్మీర్‌కు స్వల్ప వ్యవధిలో షాక్ తగిలింది. శుభమ్ పుందిర్ (121), అబ్దుల్ సమద్ (61)ను కర్ణాటక బౌలర్లు త్వరగానే పెవిలియన్‌కు పంపారు. అదొక్కటే కర్ణాటకకు ఈ రోజు గేమ్‌లో ఊరట. తొలి రోజు రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్‌కు వెళ్లిన కెప్టెన్ పరాస్ డోగ్రా (70) క్రీజ్‌లోకి వచ్చాడు.

# అతడు.. పవర్‌హౌస్ ఆఫ్ వరల్డ్ క్రికెట్: హ్యారీ బ్రూక్




టీ20 ప్రపంచకప్ 2026లో సెమీఫైనల్‌కు చేరుకున్న తొలి జట్టుగా ఇంగ్లాండ్ నిలిచింది. గ్రూప్-2 నుంచి మరో మ్యాచ్ మిగిలిఉండగానే సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. పాకిస్థాన్‌పై సెంచరీతో జట్టు విజయంలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కీలక పాత్ర పోషించాడు. అయితే, మాజీ సారథి జోస్ బట్లర్ మరోసారి విఫలమై నిరాశ పరిచాడు. ఇప్పటివరకు ఐదు మ్యాచుల్లో బట్లర్ కేవలం 62 పరుగులు మాత్రమే చేశాడు. అతడి ఫామ్‌పై బ్రూక్ స్పందించాడు. తమకు వన్డే, టీ20 ప్రపంచకప్‌లను అందించిన సారథి బట్లర్ అని బ్రూక్ గుర్తు చేశాడు. "నేను ఇప్పటికే చాలాసార్లు ఈ విషయంపై మాట్లాడా. బట్లర్ ప్రపంచ క్రికెట్‌కు పవర్‌హౌస్ లాంటోడు. కెరీర్‌లో ఎన్నో అద్భుతాలు సాధించాడు. వన్డే, టీ20 ప్రపంచ కప్‌లను గెలిపించాడు. ఇప్పుడు అతడి టైమ్ కాదంతే. తప్పకుండా బట్లర్ నుంచి గొప్ప ఇన్నింగ్స్ చూడబోతున్నాం. అయితే, అభిమానులకు ఓ విజ్ఞప్తి. ఇంకాస్త సమయం ఇవ్వండి. మరీ ఎక్కువగా స్పందించాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు దాదాపు 500కి పైగా టీ20లు ఆడాడు. ఇంగ్లాండ్ తరఫున 150కి పైగా మ్యాచుల్లో 145+ స్ట్రైక్‌రేట్‌తో పరుగులు రాబట్టాడు. అందుకే, చెబుతున్నా అతడు మా బెస్ట్ ప్లేయర్" అని బ్రూక్ వెల్లడించాడు.

# సూర్య విషయంలో అలా చేస్తే మూర్ఖత్వమే: మైకెల్ వాన్




టీ20 ప్రపంచ కప్‌లో సూపర్-8 దశ కొనసాగుతోంది. ఇప్పటికే టీమ్‌ఇండియా తన తొలి సూపర్-8 మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది. గురువారం జింబాబ్వేతో తలపడేందుకు చెన్నై వేదికగా తీవ్ర సాధన చేస్తోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన ఫామ్‌తో లీగ్ స్టేజ్‌లో పరుగులు రాబట్టాడు. మరోసారి అతడి నుంచి భారీ ఇన్నింగ్స్ రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే, ఈ టీ20 ప్రపంచ కప్ ముగిసిన తర్వాత సూర్యకుమార్‌ను కెప్టెన్సీ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వస్తున్నాయి. కొత్త సారథ్యం వైపు టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ చూస్తోందన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఈ క్రమంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. సూర్య విషయంలో అలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచించాడు.

"సూర్యకుమార్ యాదవ్ ఓ అద్భుతం. ఇలాంటి జీనియస్ ప్లేయర్‌ను కొనసాగించాలి. టీ20 ప్రపంచ కప్ తర్వాత 'స్కై'ను కాదని మరొక సారథిని తీసుకురావాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది" అని అన్నాడు. "తిలక్ వర్మ స్ట్రైక్‌రేట్‌ను పెంచుకోవాలని చూస్తుంటాడు. అయితే, బ్యాటింగ్ లైనప్‌ను ఓ సారి గమనిస్తే.. విభిన్నమైన కూర్పుతో బరిలోకి దిగుతుంటాం. అందులోనూ నిలకడైన ఆటతీరు ప్రదర్శించడం చాలా ముఖ్యం. కొన్నిసార్లు నిలకడగా ఆడే సమయంలో స్ట్రైక్‌రేట్ మరీ ఎక్కువగా ఉండకపోవచ్చు. కొన్నిసార్లు 130-140 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేయడం వల్ల పునాది వేయగలుగుతాడు. ఇదంతా బ్యాటింగ్ లైనప్‌నుబట్టి ఆధారపడి ఉంటుంది" అని పేర్కొన్నాడు. "ఈ ప్రపంచ కప్పే పాకిస్థాన్ క్రికెటర్ బాబర్ అజామ్‌కు చివరి టీ20 టోర్నీ. బాబర్ అజామ్‌ను నేను పొట్టి ఫార్మాట్ ప్లేయర్ అనుకోవడం లేదు. అతడికి వన్డే ఫార్మాట్ చక్కగా నప్పుతుంది. టెస్టుల్లోనూ స్పెషలిస్ట్‌గా మారొచ్చు" అని మైకెల్ వాన్ విశ్లేషించాడు.

# న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంక



కొలంబో: టీ20 ప్రపంచ కప్ సూపర్-8లో భాగంగా శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. సెమీస్ రేసులో నిలవాలంటే ఇరు జట్లకూ ఇందులో విజయం సాధించడం అత్యంత ముఖ్యం. టాస్ నెగ్గిన శ్రీలంక కెప్టెన్ దాసున్ శనక బౌలింగ్ ఎంచుకున్నాడు. తుది జట్టులో ఒక్కో మార్పుతో శ్రీలంక, కివీస్ జట్లు బరిలోకి దిగాయి. శ్రీలంక జట్టులోకి మిషారా స్థానంలో అసలంక వచ్చాడు. కివీస్ ఆల్‌రౌండర్ జేమ్స్ నీషమ్‌కు బదులు కోలె మెక్‌కాంచీకి 'ఫైనల్ XI'లో స్థానం దక్కింది. శ్రీలంక: పాథున్ నిశాంక, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), చరిత్ అసలంక, పవన్ రత్నాయకె, కమిందు మెండిస్, దాసున్ శనక (కెప్టెన్), దునిత్ వెల్లలాగె, దుషాన్ హేమంత, దుష్మంత చమీర, మహీశ్ తీక్షణ, దిల్షాన్ మదుషంక టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), ఫిన్ అలెన్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డారిల్ మిచెల్, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), కోలె మెక్‌కాంచీ, మాట్ హెన్రీ, ఐష్ సోధి, లాకీ ఫెర్గూసన్.

## సాంట్నర్-కోలే కీలక భాగస్వామ్యం..

టీ20 ప్రపంచ కప్ సూపర్-8 మ్యాచ్‌లో శ్రీలంకకు న్యూజిలాండ్ 169 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (47) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ 3, దుష్మంత చమీర 3, వెల్లలాగె ఒక వికెట్ తీశారు. ఓ దశలో శ్రీలంక బౌలర్ల దెబ్బకు కివీస్ బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కివీస్ ఇన్నింగ్స్ కాస్త దూకుడుగానే ప్రారంభమైంది. ఫిన్ అలెన్ (23), టిమ్ సీఫెర్ట్ (8) దెబ్బకు మూడు ఓవర్లలోనే 30 పరుగులు చేసింది. స్వల్ప వ్యవధిలో ఓపెనర్లను కోల్పోయిన జట్టును గ్లెన్ ఫిలిప్స్(18), రచిన్ రవీంద్ర (32) కాపాడారు. అయితే, వారిద్దరితోపాటు డారిల్ మిచెల్ (3), మార్ చాప్‌మన్ (0) ఔటయ్యారు. దీంతో కివీస్ స్కోరు వంద దాటడం కూడా కష్టమేనని అనిపించింది. కానీ, కోలె మెక్‌కాంచి (31★)తో కలిసి కెప్టెన్ సాంట్నర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 47 బంతుల్లోనే 84 పరుగులు జోడించారు. దీంతో శ్రీలంక ముంగిట కివీస్ గౌరవప్రదమైన లక్ష్యాన్ని ఉంచగలిగింది.




## హైదరాబాద్‌లో వెర్టిగో (తల తిరుగుడు) చికిత్సకు న్యూరోఈక్విలిబ్రియం విస్తరణ

**₹104 కోట్ల నిధుల సమీకరణతో అత్యాధునిక సేవలు**

భారతదేశంలో దాదాపు ఆరు కోట్ల మంది వెర్టిగో, సమతుల్యత సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్నారు. అయితే, వీరిలో చాలా మందికి సరైన నిర్ధారణ జరగకపోవడం లేదా మూల కారణాన్ని పరిష్కరించకుండా కేవలం లక్షణాలను తగ్గించే మందులతోనే చికిత్స చేయడం జరుగుతోంది. ఈ లోటును భర్తీ చేయడానికి సూపర్‌స్పెషాలిటీ ఆరోగ్య సేవల సంస్థ ఫ్యూచర్ క్యూర్ ప్రైవేట్ లిమిటెడ్ పని చేస్తోంది. ఇది తన పూర్తిస్థాయి అనుబంధ సంస్థ న్యూరోఈక్విలిబ్రియం ద్వారా వెర్టిగో సమతుల్యత రుగ్మతలకు ఆధారబద్ధమైన (ఎవిడెన్స్‌బేస్డ్) చికిత్సలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ సంస్థ ఖచ్చితమైన నిర్ధారణ, లక్షిత చికిత్సపై దృష్టి సారిస్తోంది.

చాలా చికిత్సా విధానాలు కేవలం లక్షణాలనే నియంత్రిస్తాయి. అయితే, ప్రపంచంలోనే అతిపెద్ద వెర్టిగో క్లినిక్‌ల శ్రేణిగా గుర్తింపు పొందిన న్యూరోఈక్విలిబ్రియం వెర్టిగోకు కారణమయ్యే అసలు మూలాన్ని—అది లోపలి చెవి, మెదడు లేదా సమతుల్యత వ్యవస్థలో ఏదైనా కావొచ్చు పూర్తి స్థాయిలో గుర్తించి, తాత్కాలిక ఉపశమనానికి బదులుగా సంపూర్ణ చికిత్సను అందిస్తుంది. ఆసుపత్రులు, ఈ యెన్ టి క్లినిక్‌లు, న్యూరాలజీ కేంద్రాలతో సమన్వయంగా పనిచేస్తూ, ఇప్పటి వరకు ఈ సంస్థ దాదాపు 1,50,000 పై చిలుకు రోగులను నిర్ధారించి చికిత్స అందించింది. దీని ద్వారా దీర్ఘకాలిక ఫలితాలు గణనీయంగా మెరుగుపడ్డాయి.

డాక్టర్ అనిత భండారి స్థాపకురాలు, ఫ్యూచర్ క్యూర్ హెల్త్, మాట్లాడుతూ "వెర్టిగో/తల తిరుగుడు సమస్య తరచుగా తప్పుగా నిర్ధారించబడుతుంది, దీనివల్ల రోగులు సంవత్సరాల తరబడి సరైన చికిత్స లేకుండా బాధపడుతున్నారు. 1,50,000 మందికి పైగా రోగులతో మా అనుభవం ఖచ్చితమైన నిర్ధారణ ఫలితాలను మార్చగలదని నిరూపించింది అని అన్నారు.

ప్రస్తుతం న్యూరోఈక్విలిబ్రియం హైదరాబాద్‌లో 15 క్లినిక్‌లను నిర్వహిస్తోంది. వీటిలో హైటెక్ సిటీ, కోకాపేట్, మదీనగూడ, మియాపూర్, , కూకట్‌పల్లి, సోమాజిగూడ, పంజాగుట్ట, బేగంపేట్, శ్రీనగర్ కాలనీ, జూబ్లీ హిల్స్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీ నగర్, వనస్థలిపురం ప్రాంతాలలో తామ సెంటర్స్ ఉన్నట్లు తెలిపారు.

ఇటీవల ఫ్యూచర్ క్యూర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 104 కోట్లు సమీకరించింది. ఈ నిధుల సమీకరణకుకార్నెలియాన్ అసెట్ మనజిమెంట్ ఎల్ ఎల్ పి ఇతర పెట్టుబడిదారులు నాయకత్వం వహించారు.

రజనీష్ భండారి స్థాపకుడు, ఫ్యూచర్ క్యూర్ హెల్త్ మాట్లాడుతూ "ఈ నిధులు ప్రపంచానికి అన్వయించే ఆరోగ్య సాంకేతికతలను భారతదేశంలోనే అభివృద్ధి చేయగలమనే మా నమ్మకాన్ని బలపరిచాయి. భారత్‌లోని ఆసుపత్రులు అంతర్జాతీయ మార్కెట్లలో న్యూరోఈక్విలిబ్రియం సేవలను విస్తరించడమే కాకుండా, మైగ్రేన్ డయాబెటిస్ వంటి దీర్ఘకాల జీవనశైలి వ్యాధుల రంగంలోకి ప్రవేశిస్తున్నామన్నారు. నిపుణ వైద్యుల కొరతను అధిగమించేందుకు సాంకేతికతను వినియోగించడం మా ప్రధాన లక్ష్యం అని అన్నారు.

# వుదయం సినిమా




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్ఠాత్మక పాన్‌ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది' సినిమా వేసవిలో గ్రాండ్ గా విడుదల కానున్న నేపథ్యంలో బజ్ నెక్స్ట్ లెవల్ కి చేసుకుంది. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇది భారీ హాలిడే సీజన్ షోడౌన్ కు వేదికగా నిలుస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన పెద్దిలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఫస్ట్ షాట్ గ్లింప్స్, బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి కి ట్రెమండస్ రెస్పాన్స్ తో రికార్డులను బద్దలు కొట్టాయి. ఎక్సయిట్మెంట్ ని మరింతగా పెంచుతూ మార్చి 2న రెండవ సింగిల్ 'రై రై రా రా' విడుదలతో బజ్ నెక్స్ట్ లెవల్ కి వెళ్ళబోతోంది. సాంగ్ పోస్టర్‌లో రామ్ చరణ్ మ్యాసీ అవతార్ లో కనిపిస్తున్నారు. రగ్గడ్ దుస్తులు, చిరిగిన జుట్టు, గడ్డం, భుజంపై పెద్ద సుత్తిని వేలాడదీసుకుని, మెరిసే చిరునవ్వుతో కనిపిస్తున్నారు, బ్యాక్ డ్రాప్ లో గందరగోళం చెలరేగుతున్నప్పటికీ, ప్రజలు అతని చుట్టూ పరిగెత్తుతున్నారు. ఎ.ఆర్ రెహమాన్ పవర్ ఫుల్ సంగీతం ఇప్పటికే సంచలనం సృష్టించింది. పెద్ది ఈ సంవత్సరం అత్యంత ఎదురుచూస్తున్న మాస్ స్పెషాలిటీలలో ఒకటిగా రాబోతోంది. ఈ చిత్రంలో శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్‌విజేత స్వరకర్త ఎ.ఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు డీవోపీ, జాతీయ అవార్డు గెలుచుకున్న ఎడిటర్ నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్.

**సాంకేతిక సిబ్బంది:**
**రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన సమర్పకులు: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్: వృద్ధి సినిమాస్ నిర్మాత: వెంకట సతీష్ కిలారు సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా సంగీతం: ఏఆర్ రెహమాన్ DOP: ఆర్ రత్నవేలు ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా ఎడిటర్: నవీన్ నూలి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై.ప్రవీణ్ కుమార్మా ర్కెటింగ్: ఫస్ట్ షో PRO: వంశీ-శేఖర్**




## నిజాయితీ గల శ్రీ చిదంబరం గారు

వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన బ్లాక్ బ్లాక్ బస్టర్ చిత్రం 'శ్రీ చిదంబరం గారు'. ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయమయ్యారు. చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన ఈ చిత్రం థియేటర్స్ లో అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం ఫిబ్రవరి 26 నుంచి ఈవిన్ ఓటీటీలో ప్రసారం కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ స్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ గ్రాండ్ గా నిర్వహించారు.

ప్రీ స్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ ప్రెస్ మీట్ లో డైరెక్టర్ నందిని రెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. డైరెక్టర్ వినయ్ ని ఇప్పుడే కలుస్తున్నాను. కానీ తన ఇంటర్వ్యూ ఒకటి చూశాను. నా జర్నీ నేను గుర్తుకొచ్చింది. 25 ఏళ్ల ఒక అబ్బాయికి ఇంత పాషన్ తో సినిమా తీయడం మామూలు విషయం కాదు. ఖచ్చితంగా తను భవిష్యత్తులో చాలా గొప్ప కథలు చెబుతాడు. ఈటీవీ విన్ కారణంగా చాలా కొత్త కంటెంట్, కొత్త ఫిలిం మేకర్స్ ఇండస్ట్రీకి వస్తున్నారు. డైరెక్టర్ వినయ్ వాయిస్ లో నిజాయితీ ఉంది. ఈ సినిమాలో నిజాయితీ ఉంది. ఈ సినిమా మీ అందరికీ కనెక్ట్ అవుతుంది. తెలుగు చిత్ర పరిశ్రమ చిరకాలం ఉంటుంది. ఇంత మంచి సినిమాలను ప్రేమించే మన ఆడియన్స్ కోసం ఈటీవీ ఇలాంటి మంచి కథలు చెబుతున్నారు. 45 రూపాయలకి సబ్స్క్రిప్షన్ తీసుకోండి. చాలా హార్ట్ ఫుల్ గా చెప్పిన కథ ఇది. ఈ సినిమా చూశాక కచ్చితంగా చాలామంది ఫిలిం మేకర్స్ ఇన్స్పైర్ అవుతారు. ఈటీవీలో ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవుతుంది.

## విష్ణు విన్యాసం

### ఫ్యామిలీ అంతా ఎంజాయ్ చేస్తారు



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ 'విష్ణు విన్యాసం'తో అలరించబోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది. ఇపటికే ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హీరో శ్రీ విష్ణు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీరు గ్రహాలని, జాతకాలని నమ్ముతారా?**
అన్ని ఫాలో అవ్వను, కానీ మనం చిన్నప్పటి నుంచి అందరితోపాటు అలవాటు చేసుకున్న కొన్నిటిని ఫాలో అవుతాను. పర్సనల్ గా నాకైతే ఫలానా టైము ఫలానా నెంబర్లు అనే నమ్మకాలు లేవు.

**విష్ణు విన్యాసం ప్రాజెక్టు ఎలా మొదలైంది?**
డైరెక్టర్ మారుతి కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. అందరూ రిలేట్ అయ్యే కథ, చాలా మంచి క్యారెక్టర్. ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా నవ్వుకోవచ్చు. కథ విన్న వెంటనే మొదలుపెట్టాం.

**ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ చాలా డామినేటింగ్ గా ఉంది కదా?**
ఆ క్యారెక్టరైజేషన్ ని ప్రేక్షకులు చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. హీరోయిన్ డామినేషన్ సినిమాలో నా క్యారెక్టర్ కి ప్రాబ్లం అవుతూ ఉంటుంది. ఆడియన్స్ మాత్రం చాలా బాగా కనెక్ట్ అవుతారు. అందునుంచి చాలా మంచి ఫన్ జనరేట్ అవుతుంది. ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ కాస్త అనుమానస్పదంగా ఉంటుంది. నయన్ సారిక రెండు మూడు పేజీలు సీన్ కూడా సింగిల్ టేక్ లో చేసింది. తన పెర్ఫార్మెన్స్ ఈ సినిమాలో చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఆడియన్స్ చాలా బాగా కనెక్ట్ అవుతారు. ఫస్ట్ హాఫ్ యూత్ కి సెకండ్ హాఫ్ యూత్ తో పాటు ఫ్యామిలీ కూడా కనెక్ట్ అవుతుంది. సెకండ్ హాఫ్ లో వచ్చే ఫ్యామిలీ కామెడీ ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలాంటి ఎక్సైట్మెంట్ ని క్రియేట్ చేసింది?**
ఇలాంటి క్యారెక్టర్ చేయడం నాకు కొత్త. ఈ క్యారెక్టర్ కి కొన్ని రూల్స్ ఉంటాయి. చాలా నమ్మకాలు ని ఫాలో అవుతుంటాడు. చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. డైరెక్టర్ మారుతి సినిమాని చాలా బాగా హ్యాండిల్ చేశాడు. చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. ఎడిటింగ్ మీద కూడా చాలా మంచి గ్రిప్ ఉంది. అలాగే సినిమాలో మంచి అనుభవం ఉన్న టెక్నీషియన్స్ పనిచేయడం కూడా ప్లస్సు అయ్యింది.

**మ్యూజిక్ గురించి?**
రథన్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అన్ని కూడా కథ నుంచి వచ్చిన పాటలే. నాలుగు పాటల్లో కూడా మంచి ఫన్ ఉంటుంది.మేము షూటింగ్ కి వెళ్ళకముందే పాటలన్నీ చేయించుకున్నాం. మా వరకు తను అనుకున్న సమయం లోనే పాటలన్నీ ఇచ్చేశారు. తను అందుబాటులో లేకపోవడం వల్ల నేపథ్య సంగీతం సురేష్ బొబ్బిలి గారితో చేయించాం. అది కూడా అద్భుతంగా వచ్చింది

**మీ మార్క్ డైలాగ్స్ ఇందులో ఉంటాయా**
అన్నీ ఉంటాయి. కథ, క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్ గా సరదాగా అనిపిస్తాయి. ఇందులో ఇంకొంచెం డిఫరెంట్ టైమింగ్ చూస్తారు. ఇందులో లెక్చరర్ గా కనిపిస్తాను. అక్కడ కూడా తను నెంబర్లను ఫాలో అవుతాడు. ఇందులో వీరి వీరి గుమ్మడి పండు అనే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ ఎపిసోడ్ కి థియేటర్ మొత్తం నవ్వులతో బ్లాస్ట్ అవుతుంది. అలాగే ఇంటర్వెల్లో ఎవరు ఊహించనంత ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. ఇందులో మంచి సిచువేషన్ కామెడీ ఉంటుంది.

**బ్యాక్ టు బ్యాక్ ఓటిటి డిల్స్ ఫినిష్ కావడం ఎలా అనిపిస్తుంది?**
ఈ రెండు సినిమాలేకాదండి..మరో మూడు సినిమాల డీల్స్ కూడా కంప్లీట్ అయ్యాయి. రిలీజ్ కి ముందే ప్రొడ్యూసర్స్ హ్యాపీగా ఉండడం చాలా ఆనందాన్నిస్తుంది. మన బడ్జెట్ బ్రాకెట్లో జాగ్రత్తగా సినిమా చేసుకోవడానికి కూడా ఒక మంచి అవకాశం. నేనెప్పుడూ కూడా ప్రొడ్యూసర్ పెట్టే డబ్బులు వెనక్కి వస్తే చాలు అనే ఆలోచనతోనే ఉంటాను. ఇప్పుడు అలా అన్ని సినిమాలు జరగడం హ్యాపీగా ఉంది.

**ఇందులో సత్యతో మీ కామెడీ ఎలా ఉండిపోతుంది?**
సత్యతో ఇంతకుముందు చేశాను. ఇందులో తను నాకు కో లెక్చరర్ గా కనిపిస్తాడు. చాలా సరదాగా ఉంటుంది.

**ఈ సినిమా ఆడియన్స్ కి ఎలాంటి ఎక్స్పీరియన్స్ ఇస్తుంది?**
ఒక రెండు గంటలపాటు హాయిగా నవ్వుకోవచ్చు. మంచి ఎంటర్టైనర్. ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా చూడొచ్చు. ఈ వీకెండ్ కి హ్యాపీ గా టైం పాస్ చేసి రావచ్చు.



## నా భర్త విజయ్ దేవరకొండ

**విజయ్ దేవరకొండ, రష్మిక మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడు ముళ్లు వేశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను రష్మిక అభిమానులతో పంచుకుంటూ 'హాయ్ మై లవ్స్.. నా భర్తను మీకు పరిచయం చేస్తున్నా మిస్టర్ విజయ్ దేవరకొండ' అని పేర్కొన్నారు.**



## అనిల్ రావిపూడి నెక్స్ట్ మూవీ అనౌన్స్ మెంట్





బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి తన మచ్ ఎవైటెడ్ నెక్స్ట్ మూవీ అనౌన్స్ మెంట్ తో మరోసారి అందరిలో ఆసక్తిని పెంచారు. వరుసగా తొమ్మిది బాక్సాఫీస్ విజయాలతో అదరగొట్టిన అనిల్ రావిపూడి.. ఈ సంక్రాంతికి వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు'తో ఆల్ టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్ అందిస్తూ బిగ్గెస్ట్ సక్సెస్ ని నమోదు చేశారు. ఇప్పుడు ఆయన కొత్త ప్రాజెక్ట్ లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా నటించనున్నారు.

F2, F3, సంక్రాంతికి వస్తున్నం వంటి బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైనర్‌ల తర్వాత ఇది అనిల్ రావిపూడి వెంకటేష్‌తో కలిసి చేస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. ఇటీవలే MSGలో అతిథి పాత్రలో అదరగొట్టారు వెంకటేష్. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్‌తో ఇది అనిల్ రావిపూడి రెండవ చిత్రం.

దర్శకుడు అనిల్ రావిపూడి దగ్గుబాటి, నందమూరి కుటుంబాల నుంచి వచ్చిన స్టార్స్ ని కలిపి ఈ కొత్త చిత్రాన్ని ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే కథాంశంతో రూపొందిస్తున్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే కంప్లీట్ ఎంటర్టైనర్ గా ఉండబోతుంది. అనిల్ రావిపూడి ట్రేడ్‌మార్క్ స్టయిల్, హ్యూమర్, ఎమోషన్స్, ఎంటర్టైమెంట్ తో సంక్రాంతికి ఫెస్టివ్ ట్రీట్‌గా నిలవనుంది. ఈ చిత్రం ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉంది, ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న భారీ అంచనాలను తగ్గట్టుగా దర్శకుడు స్క్రిప్ట్‌ను జాగ్రత్తగా మెరుగుపరుస్తున్నాడు. సాంకేతిక బృందం గురించి వివరాలు, ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తారు. ఇద్దరు స్టార్ హీరోలు, వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు కలిసే ఈ సినిమా ఇప్పటికే టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలుస్తోంది.

ఈ చిత్రం 2027 సంక్రాంతికి విడుదల కానుంది. అనిల్ రావిపూడి, సంక్రాంతి మధ్య ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని మరోసారి గుర్తు చేస్తోంది. ప్రతి సంవత్సరం పండుగకు ఆయన సినిమాలు ప్రేక్షకులకు గ్రాండ్ ఎంటర్టైన్‌మెంట్ అందిస్తున్నాయి. సంక్రాంతి వినోదాలకు అనిల్ రావిపూడి చిరునామా అనే భావనను ఇది మరింత బలపరుస్తోంది.

## హేబల్‌వంత్ బ్రేక్ ఈవెన్ సాధించింది: నిర్మాత

ప్రామిసింగ్ కథానాయకుడు సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'హే బల్‌వంత్'. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ శుక్రవారం ఈనెల 20న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల అభినందనలతో పాటు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకపోతుంది.ఈ నేపథ్యంలో చిత్ర బృందం తొలిసారిగా, వినూత్నంగా థాంక్యూ మీట్ ఫర్ బ్రేక్ ఈవెన్ డన్ ఈవెంట్‌ను నిర్వహించింది. నిర్మాత బి.నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో వచ్చిన తొలి సక్సెస్ ఇది. చూసిన ప్రతి ఒక్కరూ ఎంతో సంతృప్తి చెందారు. ఓ మంచి సినిమా తీశానని అభినందించారు. కొన్ని థియేటర్‌స్‌కి వెళ్లి నేను ఆడియన్స్ మధ్యలో సినిమా చూశాను. సినిమాను అందరూ ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. నాకు ఇది ఎంతో సంతృప్తి నిచ్చింది. ఓ మంచి సినిమా తీశాననే భావన కలిగింది. తప్పకుండా సినిమా చూడని వాళ్లు అందరూ ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు గోపీ అచ్చెర మాట్లాడుతూ '' ఈ మూవీ చూసిన అందరూ ప్రశంసలు కురిపిస్తుంటే ఆనందంగా ఉంది. ముఖ్యంగా యూఎస్‌లో ఆడియన్స్ కు కూడా ఈ సినిమా నచ్చింది. ఈ సక్సెస్‌కు కారణమైన అందరికి నా కృతజ్ఞతలు' అన్నారు.





సాయి సింహాద్రి సైన్మా బ్యానర్ మీద సాయి సింహాద్రి హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'సన్ ఆఫ్'. ఈ మూవీని బత్తుల సతీష్ తెరకెక్కించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మాత, నటుడు అశోక్ కుమార్, రామ సత్య నారాయణ రాజు, లైన్ వెంకట్, కన్నా రవి, రామకృష్ణ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నిర్మాత, హీరో సాయి సింహాద్రి మాట్లాడుతూ .. 'సతీష్‌గారు 'సన్ ఆఫ్' కథను నాకు చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఆయన చెప్పిన కథను విన్న తరువాత నా జీవితంలో జరిగినట్టుగానే ఉంది కదా అని అనిపించింది. యదార్థ ఘటనలతో ఈ మూవీని తెరకెక్కించారని కూడా చెప్పుకోవచ్చు. నాన్న మనకు క్రమశిక్షణ, చదువు, సమయ పాలన వంటివి ఇస్తారు. డబ్బుని కాకుండా కష్టపడే తత్వాన్ని వారసత్వంగా ఇవ్వాలి. శోభా రాణి గారి వల్లే ఈ సినిమా ఈ స్థాయికి వచ్చింది. నేను ఐదు థియేటర్లు అడిగితే శోభమ్మ నాకు 300 థియేటర్లు ఇచ్చారు. ఫిబ్రవరి 27న మా సినిమా రాబోతోంది. తండ్రీకొడుకులు, ఫ్యామిలీ అంతా కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని అన్నారు.

## సన్ ఆఫ్ ప్రీ రిలీజ్

## ది ప్యారడైజ్ ఆయా షేర్ సాంగ్



నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ ది పారడైస్ ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలైన కొద్ది సేపటికే ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంది.

ఈ పాట యూట్యూబ్ గ్లోబల్ చార్ట్‌స్‌లో 9 దేశాల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. భారత్, యూఏఈలో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకోగా, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, సౌదీ అరేబియా, అమెరికా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా అద్భుతమైన ర్యాంకులు సాధించింది. ఒక తెలుగు పాటకు ఈ స్థాయి అంతర్జాతీయ ఆదరణ రావడం విశేషం.ఈ సాంగ్ లో రా ఎనర్జీ, నాని స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోయింది. ఆయన చేసిన ఐకానిక్ హుక్ స్టెప్ ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకుంది. ఫ్లోర్ మూవ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌లలో ట్రెండ్ అవుతూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తోంది.

ఆయా షేర్ విజయంతో ది పారడైస్ సినిమా ప్రమోషన్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సాంగ్ ఇప్పటికే దేశాల్ని దాటి అలరించడంతో ది ప్యారడైజ్ పై అంచనాలు నెక్స్ట్ లెవల్ కి చేరుకున్నాయి.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.